విలేఖరులు
కావలెను
రాష్ట్ర వ్యాప్తముగా అన్ని జిల్లా లకు బ్యూరోలు, స్టాఫ్ రిపోర్టర్ లు, నియోజకవర్గ స్థాయి ఇంచార్జ్ లు, మండలముల వారిగా రిపోర్టర్ లు కావలెను.
(అనుభవము కలవారికి ప్రాదాన్యత కలదు)
పూర్తి వివరములకు : 6281086394 సంప్రదించగలరు
ఎడిటర్ చల్లా శ్రీకాంత్



# రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక
ROYAL JOURNALISM
RNI : APBIL/2023/86665

గుంటూరు | సంపుటి : 01 | సంచిక : 240 | చీఫ్-ఎడిటర్ : చల్లా శ్రీనివాసరావు | బుధవారం 2 అక్టోబర్ 2024 | పేజీలు : 8 | వెల :రూ 2-00

GUNTUR | VOL-01 | ISSUE - 240 | CHIEF EDITOR : CHALLA SRINIVASA RAO | 2 WEDNESDAY SEPTEMBER 2024 | PAGES : 8 | Rs :2-00


## రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తాం: సీఎం చంద్రబాబు



పుచ్చకాయలమడ(కర్నూలు): రాయలసీమను గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారుస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోలార్, విండ్ పవర్ ఉత్పత్తి చేయడం ద్వారా ఈ ప్రాంతంలో 7.5 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు.కర్నూలు జిల్లా పుచ్చకాయలమడలో నిర్వహించిన గ్రామ సభలో సీఎం ప్రసంగించారు. "వర్క్‌ఫ్రమ్ హోమ్‌కు శ్రీకారం చుట్టాలనేది నా ఆలోచన. గ్రామాల్లో వర్క్ స్టేషన్లు ఏర్పాటు చేయడం ద్వారా సొంతూరులోనే ఉండి ఉద్యోగం చేసుకోవచ్చు. గత ప్రభుత్వంలో సీఎం మీటింగ్ అంటే పరదాలు కట్టేవారు.. చెట్లు కొట్టేసే వారు. గతంలో సీఎం మీటింగ్ అంటే ప్రజలకు నరకం కనిపించేది. కూటమి ప్రభుత్వం వచ్చాక పింఛను రూ.4వేలకు పెంచాం. ఒకటో తేదీన అధికారులు మీ ఇంటికొచ్చి పింఛను ఇస్తున్నారు. పింఛన్ల పంపిణీ శాశ్వతంగా కొనసాగిస్తాం. ఒకప్పుడు ఉద్యోగులకు జీతాలు సరిగా వచ్చేవి కావు. ఇప్పుడు ఉద్యోగులకు నెలనెలా జీతాలు, పింఛన్లు ఇస్తున్నాం. జీతాల గురించి ఎవరూ ఆందోళన చెందవద్దు. ఎన్నికల్లో ఎంతో చైతన్యంతో కూటమికి ఓట్లు వేశారు. జగన్ వెళ్తూ వెళ్తూ ఖజానా ఖాళీ చేసి వెళ్లారు. మీరు ఎక్కువ మంది కూటమి ఎంపీలను గెలిపించి మంచి పనిచేశారు.గత ఐదేళ్లలో ఒక్క ఎకరాకు నీరివ్వలేదు. వైకాపా ప్రభుత్వం చేసిన విధ్వంసం అంతాఇంతా కాదు. పైసా ఖర్చు లేకుండా రాజముద్రతో పట్టాదారు పాస్‌పుస్తకాలు ఇచ్చే బాధ్యత మాది. ఇప్పటికే ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దు చేశాం. రీ సర్వే పేరుతో ప్రజల భూముల సరిహద్దులు చెరిపేశారు.. వాటిని సరిచేస్తున్నాం. ప్రభుత్వానికి వచ్చిన ఫిర్యాదుల్లో సగం భూ సమస్యలే ఉన్నాయి. భూ సమస్యలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు పనులు ప్రారంభించాం.. రాయలసీమలో ప్రతి ఎకరాకు నీళ్లివ్వాలనేది నా లక్ష్యం.కర్నూలు నుంచి బళ్లారికి జాతీయ రహదారి తెస్తాం. కర్నూలులో హైకోర్టు బెంచ్ ఏర్పాటుచేస్తాం. మెరుగైన మద్యం పాలసీ తీసుకొచ్చాం. రూ.100 కోట్లతో మద్యం మాన్పించే కార్యక్రమం చేపడతాం. ఓర్వకల్లులో పరిశ్రమలు ఏర్పాటు చేస్తాం. దీపావళి నుంచి మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు. గ్యాస్ సిలిండర్ పంపిణీని దీపావళి రోజు ప్రారంభిస్తాం. మహిళలకు ఏడాదికి 3 సిలిండర్లు ఉచితంగా ఇస్తాం. వాలంటీర్లు లేకపోతే ఏం చేయలేరన్నారు. వాళ్లు లేకపోయినా పింఛన్లు పంపిణీ చేస్తున్నాం. వాలంటీర్లను ఏం చేయాలో ఆలోచిస్తున్నాం" అని సీఎం తెలిపారు.

## కానిస్టేబుళ్ల నియామక పరీక్షల ప్రక్రియ ప్రారంభం: హోంమంత్రి అనిత



అమరావతి: ఏపీలో ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీపై కూటమి ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. రాష్టంలో గతంలో అర్ధాంతరంగా ఆగిపోయిన కానిస్టేబుల్ నియామక ప్రక్రియను సత్వరమే చేపట్టేందుకు ప్రభుత్వం దృష్టి సారించిందని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.దీనికి సంబంధించి చేపడుతున్న ప్రక్రియను ఆమె ఇవాళప్రకటించారు. దీని ప్రకారం ఐదు నెలల్లో పెండింగ్ పరీక్షలు పూర్తి చేస్తారు.గతంలో 6,100 కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నిర్వహించాల్సి శారీరక సామర్థ్య (పీఎంటీ,పీఈటీ) పరీక్షలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. వీటిని ను ఐదు నెలల్లోగా పూర్తి చేస్తామని హోంమంత్రి ఇవాళ ప్రకటించారు. 2022లో జరిగిన ప్రిలిమినరీ పరీక్షకు 4,59,182 మంది హాజరుకాగా వీరిలో 95,209 మంది తదుపరి దశకు ఎంపికయ్యారన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు సహా పలు కారణాల వల్ల పరీక్షలు వాయిదా పడడంతో 3580 సివిల్ కానిస్టేబుల్, 2520 ఏపీఎస్పీ కానిస్టేబుల్ పోస్టుల ప్రక్రియ వాయిదా పడిందన్నారు.అప్పట్లో ప్రిలిమినరీ వ్రాత పరీక్షకు మొత్తం 3,622 మంది హోంగార్డులు హాజరు కాగా అందులో 382 మంది మాత్రమే అర్హత సాధించారన్నారు. ప్రిలిమినరీ రాత పరీక్షలో అర్హత సాధించని 100 మంది హోంగార్డులు హైకోర్టులో రిట్ పిటిషన్లు వేశారనన్నారు. హోంగార్డులను ప్రత్యేక కేటగిరీగా పరిగణించడం ద్వారా ప్రత్యేక కోటాలో విడిగా మెరిట్ జాబితాను ప్రకటించాలని కోర్టును కోరారన్నారు. ఆ వంద మంది హోంగార్డులను తదుపరి దశకు అనుమతించాలని న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిందని హోం మంత్రి వివరించారు.

## లడ్డూపై సీబీఐ దర్యాప్తుకు సర్కార్ ఓకే- సిట్ విచారణకు బ్రేక్..!




అమరావతి: ఏపీలో తిరుమల లడ్డూ తయారీలో వాడిన నెయ్యి కల్తీ అయిందన్న ఆరోపణల నేపథ్యంలో టీటీడీ ఫిర్యాదు మేరకు జరుగుతున్న సిట్ దర్యాప్తుకు బ్రేక్ పడింది. ఈ మేరకు ఇవాళ తిరుమలలో పర్యటించిన డీజీపీ ద్వారకా తిరుమల రావు కీలక ప్రకటన చేశారు.సిట్ దర్యాప్తును నిలిపేస్తున్నట్లు తెలిపిన డీజీపీ.. అందుకు గల కారణాలను కూడా వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎల్లుండి సుప్రీంకోర్టులో జరిగే విచారణ కూడా కీలకంగా మారిపోయింది.తిరుమల లడ్డూ విషయంలో రాజకీయాలు చేయొద్దంటూ సీఎం చంద్రబాబుకు సుప్రీంకోర్టు నేరుగా అంటించిన చురకల ప్రభావం సిట్ దర్యాప్తుపైనా పడింది. చంద్రబాబు వ్యాఖ్యల తర్వాత సిట్ దర్యాప్తు ప్రారంభం కావడంపై సుప్రీంకోర్టు స్వయంగా అనుమానాలు వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో పిటిషనర్ల డిమాండ్ మేరకు లడ్డూ నెయ్యి కల్తీ వ్యవహారంపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో లేదా సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్న అంశంపై సుప్రీంకోర్టు ఎల్లుండి నిర్ణయం తీసుకోనుం ది.ఈ నేపథ్యంలో రాష్టంలో సిట్ దర్యాప్తు కొనసాగిస్తే తలెత్తే పరిణామాలపై అంచనా వేసుకున్న ప్రభుత్వం దానికి బ్రేక్ వేసింది. ఈ మేరకు ఇవాళ తిరుమలలో డీజీపీ కీలక వ్యాఖ్యలు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ లాయర్లు చేసిన సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. సుప్రీం ఎల్లుండి ఇచ్చే ఆదేశాల తర్వాత సిట్ దర్యాప్తుపై తదుపరి నిర్ణయం తీసుకుంటామని డీజీపీ తేల్చిచెప్పేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వం కూడా సీబీఐ దర్యాప్తుకు అభ్యంతరాలు లేదని చెప్తున్న నేపథ్యంలో సిట్ దర్యాప్తు నిలిపివేత ప్రాధాన్యం సంతరించుకుంది.

## గ్రామాలు అభివృద్ధి చెందకుండా వికసిత్ భారత్ అసాధ్యం: కాగ్



దిల్లీ: దేశంలోని గ్రామాలు అభివృద్ధి కాకుండా వికసిత్ భారత్ లక్ష్యం చేరుకోవడం సాధ్యం కాదని కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ గిరీశ్ చంద్ర ముర్ము పేర్కొన్నారు.2047 నాటికి దేశం అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో గ్రామీణ భారతం కీలకమని వ్యాఖ్యానించారు. సమాఖ్య వ్యవ స్థలో అధికార వికేంద్రీకరణ ఇంకా పూర్తి స్థాయిలో జరగలే దని, గ్రామ సభలు, స్థానిక సంస్థలకు ఇంకా తగిన గుర్తింపు లభించడం లేదని చెప్పారు."క్షేత్రస్థాయిలో అభివృద్ధి జరగకు ండా.. వికసిత్ బారత్ లక్ష్యాన్ని చేరుకోవడం సులువు కాదు. దేశంలోని 50 శాతం జనాభా ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాల్లోనే నివసిస్తోంది. ప్రభుత్వ పాలన, వారి అభివృద్ధి, వారి పాలనాధి కారాలు, వారికి తగిన వనరులు అందిం చకుండా.. అభివృద్ధి చెందిన దేశంగా అవతరించాలన్న లక్ష్యం అందుకోవడం సా ధ్యం కాదు. మన ప్రధాని చెప్పినట్లు ఒక్కొక్కరూ ఒక్కో అడుగు వేస్తే 140 కోట్ల అడుగులు అవుతాయి. అందుకే ప్రజల భాగస్వామ్యం చాలా కీలకం" అని కాగ్ అన్నారు. దేశంలో 2.60 లక్షల పంచాయతీలు, 7 వేల స్థానిక సంస్థలు ఉన్నాయని గిరీశ్ చంద్ర మర్ము అన్నారు. స్థానిక సంస్థలను సమర్థంగా తీర్చిదిద్ది ప్రభుత్వ పథకాలు అందేలా చూడడం అనేది దేశానికి చాలా మంచిదని చెప్పారు. స్థానిక సంస్థలను బలోపేతం చేయ కుండా సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను చేరుకోవడం సాధ్యం కాదన్నా రు. స్థానిక సంస్థలకు వెళ్లే నిధుల విషయంలో అకౌంటింగ్, ఆడిటింగ్‌ది కీలక భూమిక అని పేర్కొన్నారు. కాబట్టి సరైన అకౌంటింగ్ విధానాలను పాటించని మున్సిపల్ కార్పొరేషన్‌లకు నిధులు సమీకరించే అనుతులు ఇవ్వకూడదని చెప్పారు. స్థానిక సంస్థలు సరైన అకౌంటింగ్, ఆడిట్ విధానాలు పాటించేలా చూడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాలపై కూడా ఉందన్నారు.

## సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీకి అభ్యంతరాల స్వీకరణ



రాయల్ జర్నలిజం ( బాపట్ల ) అక్టోబర్ 1 : సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా తయారీకి అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన పక్కాగా ఉండాలని ఏపీ రాష్ట్ర ఎన్నికల కమిషన్ సీఈఓ వివేక్ యాదవ్ తెలిపారు. రాష్ట్ర రాజధాని నుంచి మంగళవారం ఆయన అన్ని జిల్లాల కలెక్టర్లతో వీక్షణ సమావేశం నిర్వహించారు. కమిషన్ మార్గదర్శకాలను అనుసరించి నిర్దేశించిన గడువులోగా కార్యక్రమాలన్నిటిని పూర్తి చేయాలని వివరించారు. ఇంటింటా ఓటర్ల సర్వే ప్రక్రియ బాపట్ల జిల్లాలో 99.09% పూర్తయిందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు తెలిపారు. జాబితాలో సవరణల కొరకు 12,526 దరఖాస్తులు ఇప్పటివరకు అందాయన్నారు. 6,327 దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయని, వారంలాగా పరిష్కరిస్తామని కమిషన్ దృష్టికి తీసుకువెళ్లారు. అభ్యంతరాలపై 6,439 దరఖాస్తులు రాగా, 5,820 పరిష్కరించామని, మిగిలినవి రెండు రోజుల్లో విచారిస్తామన్నారు. 6,408 మంది బాపట్ల జిల్లాలో మృతి చెందినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం 5,441 మంది మృతుల వివరాలను పూర్తి స్థాయిలో విచారించామన్నారు. మిగిలినవి త్వరలో పరిశీలిస్తామన్నారు. పర్చూరు ఎలక్టోరల్ అధికారిగా చంద్రశేఖర్ నియమితులైనందున దరఖాస్తుల విచారణకు లాగిన్ అనుమతులు ఇవ్వాలని కోరారు. వీక్షణ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, బాపట్ల ఆర్డిఓ పి.గ్లోరియా, ఏఈఆర్ ఓ లు, తదితరులు ఉన్నారు.

## ఎన్నికల ఫలితాలు, రాహుల్ గాంధీపై పీకే ఆసక్తికర వ్యాఖ్యలు



3దిల్లీ: నాయకులు అహంకారంతో ప్రవర్తిస్తే దేశ ప్రజలు సహించరని ప్రముఖ ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిశోర్ అన్నారు. కొత్తగా రాజకీయ పార్టీని స్థాపించేందుకు సిద్ధమైన నేపథ్యంలో.ప్రముఖ పీటీఐ సంస్థకు ఆయన ఇంటర్వ్యూ ఇచ్చారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ నాయకత్వంపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు."నాయకుల అహంకారాన్ని దేశ ప్రజలు సహించలేరు. ఎన్నికల్లో సమయంలో కచ్చితంగా తగిన బుద్ధి చెబుతారు. అయితే.. నేను చేసిన ఈ వ్యాఖ్యలు ఏ నేతను లక్ష్యంగా చేసుకొని అంటున్నవి కాదు. ఎన్నికల ముందు వరకు కాంగ్రెస్ తిరిగి పుంజుకోవడంపై అనుమానాలు వ్యక్తం అయ్యాయి. ప్రతిపక్ష నేతగా ఆయన సమర్థంగా వ్యవహరించగలరని ఆ పార్టీ మద్దతుదారులు విశ్వసించారు. అయితే.. ఈ విషయంలో మరో కోణం కూడా ఉంది. ఆయనను దేశమంతా నాయకుడిగా అంగీకరించిందా..?నేనైతే అలా అనుకోవడం లేదు" అని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు.ఇప్పటివరకు కేంద్రంలో వరుసగా భాజపా మూడు సార్లు అధికారంలోకి వచ్చింది. ఎన్నికల ఫలితాలపై అడిగిన ప్రశ్నకు ఆయన స్పందిస్తూ.. "ప్రధాని మోదీ పేరు కనిపిస్తే ఓట్లు పడతాయని భాజపా భావించింది. కానీ, గతంతో పోలిస్తే ఈ సారి ఎన్నికల ఫలితాల్లో కాషాయ పార్టీ మెజారిటీలో తగ్గుదల కనిపించింది. ఎన్నికల ముందుకు కాంగ్రెస్‌ను బలోపేతం చేయడానికి రాహుల్ గాంధీ తీవ్రంగా శ్రమించారు. ఆయన నాయకత్వంపై సొంత పార్టీలో ఉన్న అనుమానాలను తొలగించారు. దీంతో కాంగ్రెస్‌ను ముందుకు తీసుకెళ్లగలరనే నమ్మకం వారిలో కలిగింది.కాగా.. ప్రశాంత్ కిశోర్ కొత్తగా రాజకీయ పార్టీని స్థాపించేందుకు సిద్ధమైన సంగతి తెలిసిందే. పార్టీ పేరు, నాయకత్వం సహా ఇతర వివరాలను అక్టోబరు 2న ప్రకటిస్తామని వెల్లడించారు. అయితే.. పార్టీ నాయకత్వం మాత్రం తన చేతుల్లో ఉండదని తెలిపారు.

## అత్యాశకు పోయి సైబర్ నేరగాళ్ల వలలో పడొద్దు: జిల్లా ఎస్పీ తుషార్ డూడి




రాయల్ జర్నలిజం ( బాపట్ల ) అక్టోబర్ 1 : డబ్బులు ఎవ్వరికీ ఊరికేరావు - మీ కష్టార్జితం సైబర్ నేరస్థుల పాలు చేయవద్దు, అపరిచిత వెబ్ సైట్స్, ఏపికె ఫైల్స్ క్లిక్ చెయ్యవద్దని జిల్లా ఎస్పీ తుషార్ డూడి జిల్లా ప్రజలకు సూచించారు. ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ మోసాల గురించి ఎస్పీ మంగళవారం ప్రజలకు వివరించారు. జిల్లా ప్రజలు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాలు గురించి అవగాహన కలిగి ఉంటే చాలా వరకు నేరాలను తగ్గించవచ్చునన్నారు. ఏదైనా సైబర్ నేరం జరిగిన వెంటనే 1930 నెంబర్ కు కాల్ చేయడం ద్వారా లేదా https://cybercrime.gov.in అను వెబ్ సైట్స్ ద్వారా పిర్యాదు చేస్తే పోగొట్టుకున్న సొమ్ము చాలా వరకు తిరిగి పొందే అవకాశం ఉంటుందన్నారు. కొత్త వ్యకులు, నంబర్ల నుండి వచ్చే వెబ్ సైట్స్ లింకులు, ఏపీకే ఫైల్స్ తెరవవద్దన్నారు. వేలల్లో పెట్టుబడులు, లక్షల్లో లాభాలు అంటూ వచ్చే వాట్సాప్, టెలిగ్రామ్ ప్రకటనలను నమ్మవద్దని సూచించారు. ఇటీవల www.iasindia88.com వంటి అనేక iasindia అను వెబ్ సైట్స్ లో చాలా మంది డబ్బులు పెట్టి మోసపోయినట్లు సైబర్ పోర్టల్ ద్వారా పిర్యాదులు వచ్చాయన్నారు. వీరు మొదట ఉచితంగా చిన్న చిన్న టాస్క్ లు నిర్వహించి గెలిచిన సొమ్ము ఖాతాలలో జమ చేస్తారని, ఆ తరువాత తక్కువ మొత్తంలో డబ్బులు పెట్టుబడి పెట్టించి రెండింతలు/ మూడింతలు అధిక ఆదాయం ఇచ్చి ఆశచూపుతారన్నారు. సైబర్ నేరగాళ్ల మాయలో పడి ఎక్కువ మొత్తంలో డబ్బులు పెట్టినపుడు వాటిని ఇవ్వకుండా మోసం చేస్తారని పేర్కొన్నారు. ప్రతి వారంలో ఒకరోజు (లేదా) గురువారం నాడు మాత్రమే అకౌంట్ లోకి డబ్బులు ట్రాన్స్ఫర్ చేసుకోవాలని నిబంధన విధిస్తారన్నారు. అప్పటి వరకు వివిధ కారణాలు చెబుతు అధిక మొత్తంలో డబ్బులు పెట్టుబడిగా పెట్టించి సైబర్ నేరగాళ్ల వెబ్సైట్ లో వున్న అకౌంట్ లో ఆ డబ్బులు అధికం అవుతున్నట్లు చూపుతారాన్నారు. తీరా డబ్బులు ట్రాన్స్ఫర్ చేసుకొనే రోజు వచ్చేసరికి మీ బ్యాంకు అకౌంట్ కు ట్రాన్స్ఫర్ అవ్వవని, అవి కేవలం వారి సైట్ లో కనిపించే డబ్బులు మాత్రమేనని తెలిపారు. మోసపోయామని గ్రహించే లోపు జరగాల్సిన నష్టం జరిగిపోతుందన్నారు. ఎదుటి వారి అమాయకత్వాన్ని, అత్యాసని సైబర్ నేరగాళ్ల ఆయుధంగా మారుతుందని, అత్యాశకు పోయి సైబర్ కేటుగాళ్ల వలలో పడవద్దని తెలిపారు. డబ్బులు ఎవ్వరికీ ఊరికేరావని, మీ కష్టార్జితం సైబర్ నేరస్థుల పాలు చేయవద్దని సూచించారు. ప్రస్తుత సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల పట్ల అవగాహన పెంచుకొని, సైబర్ కేటుగాళ్ళతో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సైబర్ నేరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు.

# ఎడిటోరియల్

## ప్రమాదకర యుద్ధక్రీడ

ఇజ్రాయెల్‌పై హమాస్ జరిపిన దాడితో ఏడాది క్రితం అక్టోబర్ 7న పశ్చిమాసియాలో చెలరేగిన హింసాత్మక సంఘర్షణ ఇప్పుడు మరో మలుపు తీసుకుంది. ముస్లిమ్‌లలోని షియా వర్గానికి చెందిన తీవ్రవాద హెజ్బొల్లా బృందానికి 32 ఏళ్ళుగా సారథ్యం వహిస్తున్న అధినేత హసన్ నస్రల్లాను భీకర గగనతల దాడుల ద్వారా ఇజ్రాయెల్ మట్టుబెట్టిన తీరు ఒక్కసారిగా అందరినీ ఉలిక్కిపడేలా చేసింది. లెబనాన్‌లోని ఇటీవలి పేజర్లు, వాకీటాకీల పేలుళ్ళ ఉదంతం మరువక ముందే ఇజ్రాయెల్ మరోసారి తన గూఢచర్య, సైనిక సత్తా చాటిన వైనం ముక్కున వేలేసుకొనేలా చేసింది. లెబనాన్‌లో తాత్కాలిక కాల్పుల విరమణకు అమెరికా, ఫ్రాన్స్‌లు గురువారం పిలుపునిచ్చినప్పుడు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ దాన్ని సమర్థిస్తున్నారనే అందరూ భావించారు. ఒక్క రోజు గడిచిందో లేదో... ఒకపక్క న్యూయార్క్‌లో ఐక్యరాజ్య సమితి సర్వప్రతినిధి సభ సమావేశం సాగుతుండగానే, మరోపక్క నెతన్యాహూ మాత్రం బీరుట్‌పై వైమానిక దాడికీ, హెజ్బొల్లా అధినేతను మట్టుబెట్టడానికీ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేశారు. ఎవరెన్ని చెప్పినా, ఐరాసలో ఎన్ని తీర్మానాలు చేసినా ఘర్షణను కొనసాగించాలనే ఇజ్రాయెల్ మంకుపట్టుతో ముందుకు పోతున్నట్టు తేటతెల్లమైంది. చిత్రమేమిటంటే, లెబనాన్‌లో కాల్పుల విరమణను బయట తోసిపుచ్చిన నెతన్యాహూ ప్రైవేటుగా మాత్రం అందుకు అంగీకరించారు. అమెరికా, ఫ్రాన్స్ అధికారులు సైతం చెప్పినమాట అదే. తీరా దాడులు మాత్రం నెతన్యాహూ కొనసాగించారు. కొన్ని నెలలుగా ఆయన తీరు అంతే. అమెరికాకు నచ్చే మాటలు పైకి చెబుతారు. కానీ, చివరకు మాత్రం తాను ఏదనుకుంటే అదే చేస్తున్నారు. అమెరికా సైతం పైకి శాంతి వచనాలు చెబుతున్నా, ఇజ్రాయెల్‌కు ఆయుధాల సరఫరా ఆపలేదు. ఆ ఆయుధాలను వాడుకుంటూ ఇజ్రాయెల్ పేట్రేగిపోతుంటే ఆపుతున్నదీ లేదు. ఇప్పటికే కొన్ని వేల మంది గాజాలో ప్రాణాలు కోల్పోయారు. గత వారంలో లెబనాన్‌లోనూ వెయ్యిమంది మరణించారు. అక్కడి జనాభాలో దాదాపు అయిదోవంతు మంది నిర్వాసితులయ్యారు. భవనాలపై బాంబు దాడులకు జడిసి, ప్రజలు వీధుల్లో నిద్రిస్తున్న పరిస్థితి. గగనతలం నుంచి బాంబులు ఆగలేదు. భూమార్గంలోనూ ముప్పు తప్పదన్న భయం తప్పడం లేదు. మరోపక్క ఇజ్రాయెల్ చేపట్టిన పని ఇంకా పూర్తి కాలేదని ఆ దేశ ప్రధాని ప్రకటించడంతో ఈ తలనొప్పి తగ్గేలా లేదు. అలాగని హెజ్బొల్లా అధినేత మరణానికి యావత్ లెబనాన్ బాధపడుతోందని అనలేం. తీవ్ర హింసకు పాల్పడి, ఎందరి మరణానికో కారణమైన నస్రల్లా పట్ల లెబనాన్, ఇజ్రాయెల్, సిరియా సహా పలు ప్రాంతాల్లో ప్రజానీకానికి పెద్దగా ప్రేమ ఏమీ లేదు. అరబ్ ప్రపంచంతో పాటు సాక్షాత్తూ లెబనాన్‌లో సైతం ఆయన మరణానికి సోషల్ మీడియాలో పెద్దయెత్తున ఆనందం వ్యక్తం కావడం గమనార్హం. సిరియన్ నియంత బషర్ అల్–అసద్‌తో చేతులు కలిపి తమ వద్ద ప్రజాస్వామ్య ఉద్యమాన్ని హెజ్బొల్లా అణిచివేయడంతో వారిలో ఆగ్రహం నెలకొంది. అందుకే ఈ రకమైన భావన వ్యక్తమైంది. లెబనీస్ ప్రభుత్వం ఏకపక్షంగా కాల్పుల విరమణ ప్రకటించి, తద్వారా లెబనీస్ సైన్యం హెజ్బొల్లా చేతుల్లోని దక్షిణ లెబనాన్‌పై నియంత్రణ సాధించి, సరిహద్దు వెంట శాంతి నెలకొల్పాలనేది వారి అభ్యర్థన. నిజానికి, ఇజ్రాయెల్‌తో యుద్ధం తాము కోరుకోకపోయినా, ఇరాన్ ఆదేశాలతో లెబనీస్‌ను నస్రల్లా దీనిలోకి లాగారని వారి వాదన. ఇలాగే సాగితే గాజా భూఖండం లాగా బీరుట్ సైతం ధ్వంసమవుతుందనీ, అంతర్యుద్ధం మళ్ళీ వస్తుందనీ లెబనీయుల భయం. ముందు ఇజ్రాయెల్, సౌదీ అరేబియా మధ్య సంబంధాలు సాధారణస్థితికి రావడం ముఖ్యం. అందుకు సౌదీలూ సిద్ధమే! కాకపోతే, రెండు దేశాల ఏర్పాటనే పరిష్కార సూత్రంతో పశ్చిమ తీరం లోని పాలెస్తీనా అథారిటీతో చర్చలు జరిపేందుకు ఇజ్రాయెల్ ముందుకు రావాలన్నది వారి షరతు. వ్యవహారం అక్కడే పీటముడి పడింది. ఇరాన్‌కు నెతన్యాహూ హెచ్చరిక, హెజ్బొల్లా నేత హత్యకు ప్రతీకారం తీర్చుకుంటామంటూ ఇరాన్ సుప్రీమ్ లీడర్ అయతొల్లా ఖమేనీ ప్రతిజ్ఞ, ఇరాన్ అండతో పెచ్చరిల్లుతున్న ఇతర వర్గాల వ్యవహారం... అంతా చూస్తుంటే ఇక ఇది అంతులేని కథే! నిజానికి, లెబనాన్, గాజాల్లోని తీవ్రవాద వర్గాలను హతమార్చాలనే ఇజ్రాయెల్ సైనిక విధానం వల్ల తాత్కాలిక లాభాలే తప్ప, శాశ్వత ప్రయోజనం ఉండదు. ఆ మధ్య సాక్షాత్తూ ఇరాన్ రాజధాని టెహరాన్‌లో హమాస్ నేత ఇస్మాయిల్ హనీయే, ఇప్పుడు బీరుట్‌లో హెజ్బొల్లా అధినేత, వెంటనే అదే గ్రూపులోని మరో కీలక నేత నబిల్ కౌక్... ఇలా పలువురిని ఇజ్రాయెల్ చంపేసింది. కానీ ఇలాంటి సంస్థల్లో ఒకరు పోతే మరొకరొస్తారు. పైగా ఇజ్రాయెల్ దూకుడు వల్ల ఇరాన్‌లోని కొత్త సంస్కరణవాద సర్కారూ చేసేదేమీ లేక, తీవ్రంగా ప్రతిస్పందించక తప్పదు. అప్పుడు ముడి మరింత బిగుస్తుంది. అగ్రదేశాల స్వార్థం, ప్రపంచ శాంతికి కృషి చేయాల్సిన అంతర్జాతీయ సంస్థల సంపూర్ణ వైఫల్యం ఈ దీర్ఘకాలిక సమస్యకూ, ఏడాదిగా ఆగని మారణహోమానికీ కారణం. పాలెస్తీనాలో ఇజ్రాయెల్ దురాక్రమణకు వచ్చే ఏడాదిలోగా ముగింపు పలకాలని ఐరాస తీర్మానించిన కొద్దిరోజులకే ఇలా జరిగిందంటే ఏమనాలి! ఐరాసకు కోరలు లేని పరిస్థితుల్లో... ప్రపంచానికి సరికొత్త శాంతిసాధన వ్యవస్థ అవసరం కనిపిస్తోంది. నెతన్యాహూ ఇలాగే తన దూకుడు కొనసాగిస్తే, పశ్చిమాసియాలో పరిస్థితి మరింత దిగజారుతుంది. లెబనాన్‌లో సైతం మరో గాజాను ఇజ్రాయెల్ సృష్టించక ముందే ప్రపంచ దేశాలు కళ్ళు తెరవాలి. నిర్బంధంగానైనా కాల్పుల విరమణను సాధించాలి. లేదంటే, పశ్చిమాసియాపై యుద్ధ మేఘాలు మరింత విస్తరిస్తాయి. ప్రపంచాన్ని చీకటితో కమ్మేస్తాయి.

# ఉల్లాసంగా, ఉత్సాహంగా శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే వేడుకలు



రాయల్ జర్నలిజం రాయచోటి అక్టోబర్ 1: రాయచోటి శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే ఫీస్తా వేడుకలను మంగళవారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మోటివేషనల్ స్పీకర్ మరియు మిమిక్రీ ఆర్టిస్ట్ డి. జి. రామ మూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ విద్యార్థులు చక్కటి ప్రణాళికను సిద్ధం చేసుకుని ఇంజనీరింగ్ మరియు మేనేజ్మెంట్ విద్యను అభ్యసించాలని , తద్వారా అనుకున్న లక్ష్యాన్ని అధిరోహించి తల్లిదండ్రుల,అధ్యాపకుల కీర్తిని ఇనుమడింపజేసి ,సమాజాభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు . కమ్యూనికేషన్ స్కిల్స్ ను పెంపొందించుకొని ఉన్నత ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవాలని, నచ్చిన రంగాన్ని ఎంచుకొని ఉద్యోగ ఉపాధి విస్తరణ దిశగా అడుగులు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమము లో కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు మరియు దేశ సంపద యువత అని కావున విద్యార్థిని విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించి దేశ నిర్మాణానికి పాటుపడాలని పిలుపునిచ్చారు. సాయి కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతంలో సాంకేతిక కళాశాలను స్థాపించి పేద మధ్యతరగతి విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు అందిస్తున్న శ్రీ సాయి కళాశాల యాజమాన్యాన్ని మరియు కళాశాలలో ర్యాగింగ్ రహిత మరియు ఒత్తిడి లేని విద్యను అందిస్తూ, యూనివర్సిటీ స్థాయిలో ఉత్తమ ఫలితాల సాధనలో భాగమైన అధ్యాపకులను మరియు విద్యార్థిని విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా శ్రీసాయి విద్యా సంస్థల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం .సుధాకర్ రెడ్డి కార్యక్రమానికి హాజరైన విద్యార్థినీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా కేంద్రంలో గత 24 సంవత్సరాల నుండి యూనివర్సిటీ పరిధిలో అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తూ ఎందరో విద్యార్థినీ విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును అందించిన ఘనత శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలకు దక్కుతుందని అభిప్రాయపడ్డారు . ఈ కళాశాల విద్యార్థిని విద్యార్థులు దేశ విదేశాలలో, ప్రభుత్వ, అఖిలభారత స్థాయి, ప్రైవేటు రంగాలలో, బ్యాంకింగ్ ,సాఫ్ట్వేర్, ఇస్రో వంటి సంస్థల యందు ఉన్నత స్థానాలలో స్థిరపడ్డారని తెలియజేశారు. ఈ కళాశాల విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో గోల్డ్ మెడల్స్ మరియు ప్రతిభా పురస్కారాలను అందుకొని కళాశాల స్థాయిని యూనివర్సిటీ స్థాయిలో ఇనుమడింప చేశారని పేర్కొన్నారు .ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకొని లక్ష్య సాధనకు అంకితభావంతో కృషి చేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి తల్లిదండ్రులను, చదువుతున్న కళాశాలను మర్చిపోకూడదని పాఠాలు బోధించే ఉపాధ్యాయులను గౌరవించాలని సూచించారు .క్రమశిక్షణతో ప్రతి విద్యార్థి కష్టపడి చదివి జీవితంలో ఉన్నత స్థానానికి చేరుకోవాలని తెలియజేశారు. అర్హత సాధించిన ప్రతి విద్యార్థికి ఉద్యోగ భరోసా కల్పిస్తూ అవసరమైన మౌలిక వసతులను కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ మరియు ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగముల నుండి అత్యుత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థినులు అభినందిస్తూ బహుమతులను బహుకరించారు. ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ ,ఎంబీఏ విభాగాల యందు యూనివర్సిటీ పరీక్షల యందు ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు జ్ఞాపికలను మరియు ప్రశంసా పత్రాలను అందజేశారు . ఈ సందర్భంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు . ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ వివిధ విభాగాధిపతులు అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు .

# మాలమహానాడు పీలేరు ఇంచార్జ్ గా గెడి చిరంజీవి ఎన్నిక



రాయల్ జర్నలిజం,(వాల్మీకిపురం), అక్టోబర్ 01:జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం వాల్మీకిపురంలో నూతన మండల కమిటీ నిర్ణయించుటకు విచ్చేసిన సమయములో పీలేరు నియోజకవర్గం మాలమహానాడు ఇంచార్జిగా చింతపర్తి కి చెందిన గెడి చిరంజీవిని ఎన్నుకున్నారు. 6 మండలాలైన పీలేరు, కేవీ పల్లి, కలకడ, కలికిరి, వాల్మీకిపురం, గుర్రంకొండ మాలల అండ కొరకు పీలేరు నియోజకవర్గం ఇంచార్జి భాద్యతను అప్పగించారు. గెడి చిరంజీవి మాట్లాడుతూ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం గారు నాపై నమ్మకం ఉంచి 2015లో మొదటగా చింతపర్తి గ్రామ అద్యక్షులుగా, 2020లో వాల్మీకిపురం మండల ప్రధాన కార్యదర్శిగా, 2022లో మండల గౌరవ అద్యక్షులుగా, 2023లో మండల అద్యక్షులుగా, ఇప్పుడు 2024లో పీలేరు నియోజకవర్గం ఇంచార్జిగా భాద్యతలు అప్పగించినందుకు ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు. తనకు అప్పగించిన భాద్యతలు సక్రమంగా నిర్వర్తించి నియోజకవర్గ మాలల ఎదుగుదల కొరకు పాటు పడతానని, మాలలకు జరిగే అన్యాయాలు, అక్రమాలు జరిగితే న్యాయం కొరకు నీతి నిబద్ధతతో పోరాడుతానని తెలియజేసారు. మండల నూతన కార్యవర్గ కమిటీకి శుభాకాంక్షలు తెలియజేసారు.

# వక్క మార్కెట్‌కు స్థల పరిశీలన



అమరాపురం రాయల్ జర్నలిజం అక్టోబర్ 01 సత్య సాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండలంలోని ఒక్క మార్కెట్ నిర్మాణానికి రీజినల్ జాయింట్ డైరెక్టర్ మార్కెటింగ్(ఆర్ జే డి ఎం) అధికారి కడప రామాంజనేయులు స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని ఉదగూరు గ్రామానికి చెందిన రైతు ప్రకాష్ ఇంటి ఆవరణలో ఆరబెట్టిన వక్కను మరియు యంత్రాల ద్వారా ఒక్క చిప్పను వేరు చేసిన వక్కను పరిశీలించారు. ఈ ప్రాంతంలో బోరుబావుల క్రింద రైతులు అధికంగా ఒక్క తోటలు సాగు చేశారని, మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని రైతుల నుండి తెలుసుకున్నారు. అదేవిధంగా మండలంలోని వలస, తమ్ముడే పల్లి గ్రామాల్లో రైతులు సాగు చేసిన తమలపాకు తోటలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. తమలపాకు ధరలు పడిపోవడంతో కూలి ఖర్చులకు సరిపోతుందన్నారు. ఒక్క, తమలపాకు తోటలను జాతీయ ఉపాధి హామీ పథకం కింద అను సంధానం చేస్తే రైతులకు కూలి ఖర్చులైనా మిగులుతాయని రైతులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్రీ ట్రేడ్ మార్కెటింగ్ అధికారి నరసింహమూర్తి, మార్కెట్ యార్డ్ సెక్రటరీ మడకశిర నాగేంద్ర కుమార్ మరియు జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఉగ్ర నరసింహ,హాలుకూరు పంచాయితీ మాజీ సర్పంచ్ నాగమ్మ ప్రకాష్, బంగారప్ప ,రైతులు పాల్గొన్నారు.

# దాసరిపల్లి జయచంద్ర రెడ్డి సమస్యల అర్జీని అందజేసిన భవన నిర్మాణ కార్మికులు

రాయల్ జర్నలిజం అక్టోబర్ 1 ములకల చెరువు : తంబళ్లపల్లి నియోజకవర్గం ములకలచెరువు టౌన్ భవన నిర్మాణ కార్మికులు సకాలంలో పనులు లేవని తంబళ్లపల్లె నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ దాసరిపల్లి చంద్ర రెడ్డి కి అర్జీ అందజేయడం జరిగింది. ఇసుక అందుబాటులో లేనందువలన వారికి రోజువారి పనులు లేవని మరియు ఇసుక లేనందువలన భవన నిర్మాణాలు కూడా ఆపివేశారని దీనితో వీరికి రోజువారి కూలీలు ఆగిపోయాయని వీలైనంత త్వరగా ఈ సమస్యకు పరిష్కారం చూపించాలని భవన నిర్మాణ కార్మికులు దాసరిపల్లి జయచంద్ర రెడ్డి కి అర్జీని అందజేశారు. దాసరిపల్లి జయచంద్ర రెడ్డి వారి అర్జీని స్వీకరించి సానుకూలంగా



స్పందించి త్వరలోనే ఇసుక అందుబాటులోకి వస్తుందని మళ్లీ మీ మీ పనులకు అవకాశాలు వస్తాయని రోజువారి పనులకు మళ్లీ ప్రారంభమవుతాదని తెలియచెప్పారు. అర్జీని అందించిన వారు శంకర్ బాషా రాజు జబ్బారు నాగరాజు వెంకటేశు కుమార్ మేస్త్రి డాన్ శీను మరియు ఇతర మేస్త్రీలు అర్జీని అందజేయడం జరిగింది.

# గ్రామ సభను జయప్రదం చేయండి

### ముఖ్య అతిథులుగా పాల్గొన్న మంత్రి, జిల్లా కలెక్టర్

లక్కిరెడ్డిపల్లి రాయల్ జర్నలిజం అక్టోబర్ 1: లక్కిరెడ్డిపల్లి మండలం లక్కిరెడ్డిపల్లి గ్రామంలో అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా గ్రామ సభను ఎండిఓ ఆఫీస్ ఆవరణంలో నిర్వహిస్తున్నారు,. ఈ గ్రామ సభకు ముఖ్య అతిథులుగా రాష్ట్ర క్రీడల యువజన శాఖ మాత్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మరియు జిల్లా కలెక్టర్ , అన్నమయ్య జిల్లా ఉన్నతాధికారులు పాల్గొందురు. ఈ కార్యక్రమానికి మండల ప్రజలు, తెలుగుదేశం కార్యకర్తలు, మండిపల్లి అభిమానులు పాల్గొని సభను జయప్రదం చేయాలని మండల నాయకులు యనమల మదనమోహన్ , రాజంపేట డాక్టర్ సెల్ అధ్యక్షుడు షఫీ నాయక్, ఆరిఫ్, మండల తెలుగుదేశం పార్టీ నాయకులు కోరారు.

# ఏపీ మోడల్ స్కూల్ నందు భోజనం చెకింగ్

### టిడిపి ప్రచార కార్యదర్శి యనమల విశ్వనాథ్



రాయల్ జర్నలిజం లక్కిరెడ్డిపల్లి అక్టోబర్1: లక్కిరెడ్డిపల్లి మండలం అన్నమయ్య జిల్లా,మోడల్ స్కూల్ నందు, మధ్యాహ్న భోజనం, ఎలా ఉన్నాయని భోజనం టైం లో కోమటిరెడ్డి శివశంకర్ రెడ్డి ప్రిన్సిపాల్ తో కలిసి, ఆరా తీసిన ఎస్ఎంసి చైర్మన్ మనీ %డ%విశ్వనాథ్, భోజనం బాగుంది రోజు కూడా బాగా చేయాలని కుకింగ్ మాస్టర్ కు సూచించడం జరిగింది, స్టూడెంట్ అందరికీ ఒకసారి పెట్టిన భోజనం సరిపోకపోతే, రెండోసారి కూడా కావాల్సిన వారు పెట్టించుకుని తినమని తెలియజేశారు

# విశాఖ స్టీల్ ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

**-ప్లాంటుకు సొంత గనుల కేటాయించి - ప్రైవేటీకరణ ప్రయత్నాలు ఆపాలి**

**-ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పిడిఎస్ యు, ఏఐఎస్ఎ, ఏఐవైఎఫ్**

**- రాయచోటి కలెక్టర్ కార్యాలయం ఎదుట విశాఖ ఉక్కు రక్షణ కోసం రిలే దీక్షలు**

**- విద్యార్థి యువజన సంఘాలు**

రాయల్ జర్నలిజం రాయచోటి అక్టోబర్ 1: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కి సొంత గనులు కేటాయించాలని సెయిల్ లో కలపాలని కోరుతూ విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే దీక్షలను ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోటేశ్వరరావు ప్రారంభించడం జరిగింది. ఈ రిలే దీక్షలను ఉద్దేశించి ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ సిపిఐ జిల్లా కార్యదర్శి పిఎల్ నరసింహులు సిఐటియు జిల్లా కార్యదర్శి రామానుజులు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ మాట్లాడుతూ 32 మంది విద్యార్థుల త్యాగాల ఫలితంగా, వందలాదిమంది వామపక్ష ఎమ్మెల్యేల రాజీనామాలతో, వేలాది మంది రైతుల యొక్క త్యాగాలతో నిర్మించుకున్న విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రైవేటీకరణ చేసే ఆలోచనను ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఒకవైపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తామని చెబుతూనే స్వరములో మార్పు చేసి నష్టాలు వస్తే ఎన్ని రోజులని భరిస్తారు అని మాట మార్చడం ఎంతవరకు సమంజసం అని వారు ప్రశ్నించారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని సెయిల్ లో కలుపుతామని ప్రకటన చేస్తూనే రాత్రికి రాత్రి 4000 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించడం దేనికి సాంకేతం అని ప్రశ్నించారు.



వెంటనే విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ కి సొంత గనులు కేటాయించి, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీని ప్రభుత్వ రంగంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో, కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి ప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ చేస్తే ప్రజాగ్రహానికి లోన్ కావాల్సి వస్తుందని హెచ్చరించారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం విధానానికి రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించి ప్రజా ఉద్యమాలలో పాల్గొని విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కలిసి రావాలని వారన్నారు. ఈ రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నరు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ప్రశాంత్ , మాధవ్ కుమార్, పి డి ఎస్ యు జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, ఐసా జిల్లా కార్యదర్శి లవ కుమార్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బాలసుబ్రమణ్యం, జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రమణ, సాయి కార్యదర్శి చందు, గురునాథ్, సతీష్ , పి డి ఎస్ యు జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్ ఏ ఐ ఎస్ ఏ జిల్లా నాయకులు హరినాథ్ విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# చెకుముకి విజేతలకు బహుమతులు

రాయల్ జర్నలిజం,(వాల్మీకిపురం), అక్టోబర్ 01: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పి.వి.సి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పోటీలలో విజేతలైన విద్యార్థులకు జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభు చరణ్ షీల్డు, ప్రశంసాపత్రాలు, పతకాలు అందజేశారు. మండల స్థాయి చెకుముకి పోటీ పరీక్షలలో ఏపీ మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థులు సాయిలీల, చరిష్మా, ఉమ్రాబాను మొదటి స్థానంలో నిలువగా, రెండవ స్థానంలో జిల్లా పరిషత్ పాఠశాల చింతపర్తి విద్యార్థులు నందకిషోర్, భాను, లాలస నిలిచారన్నారు.



వీరు ఈనెల 27 న రాయచోటిలో జరిగే జిల్లా స్థాయి పరీక్షలలో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు సావిత్రి, ఉపాధ్యాయులు సువర్ణ, కిషోర్,దుర్వాసులు నాయుడు, నాగరాజ, విద్యార్థులు పాల్గొన్నారు

## సమాజంలోని పేద ,బలహీన వర్గాలు గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు



రాయల్ జర్నలిజం రాయచోటి, అక్టోబర్ 1: సమాజంలోని పేద మరియు బలహీన వర్గాలు గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లను అందజేయడం జరుగుతోందని రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు.మంగళవారం ఉదయం ఎన్టీఆర్ భరోసా పథకం కింద రాయచోటి పట్టణంలోని శ్రీ వీరభద్ర స్వామి గుడి వెనుక 30వ వార్డులో సామాజిక పింఛన్ల పంపిణీలో భాగంగా.రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి లబ్ధిదారుల ఇంటి వద్దకే వెళ్లి పింఛన్ల సొమ్మును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అవ్వాతాతలు, వితంతువులు మరియు వైకల్యం ఉన్నవారిని మంత్రివర్యులు ఆప్యాయంగా పలకరిస్తూ.వారి యోగక్షేమాలను విచారించి పింఛన్ సొమ్మును అందజేశారు. నేరుగా తమ ఇంటి వద్దకే స్వయంగా మంత్రివర్యులు వచ్చి పింఛన్ అందజేయడంతో లబ్ధిదారులు ఉబ్బితబ్బివడంతో పాటు.ప్రభుత్వం తమకు భరోసాగా నిలుస్తోందని, పింఛన్ సొమ్ముతో గౌరవప్రదమైన జీవితాన్ని పొందగలుగుతామని, ఇది మంచి ప్రభుత్వమని తమసంతోషాన్ని వ్యక్తం చేశారు.అనంతరం మంత్రివర్యులు మాట్లాడుతూ. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం మరియు అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పింఛను మొత్తాన్ని పెంచి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా వృద్ధులు, బలహీనులు, వితంతువులు మరియు వైకల్యం ఉన్నవారు మొదలైన వారి కష్టాలను తీర్చడానికి, గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోందన్నారు. ఈ బృహత్తర కార్యక్రమ లక్ష్యాన్ని సాధించేందుకు ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచి ఏప్రిల్ 2024 నుంచి అమలు చేస్తున్నామన్నారు. అలాగే దివ్యాంగులకు రూ.6 వేలకు కు పెంచారని, పూర్తిస్థాయిలో వైకల్యానికి గురైన వారికి నెలకు రూ 15 వేలు పింఛను, కిడ్నీ తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేలు పింఛను ప్రభుత్వం అందజేస్తున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, వార్డ్ సచివాలయ సిబ్బంది, తెలుగుదేశం రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర భాష , నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఫోన్ కు స్క్రీన్ గార్డ్ అవసరం... ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్ అవసరం



రాయల్ జర్నలిజం (బాపట్ల ) అక్టోబర్ 1 : ద్విచక్ర వాహన దారులు రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు ప్రాణాలు కాపాడుకోవాలంటే హెల్మెట్ ఎంతగానో దోహదపడుతుందని డిఎస్పి రామాంజనేయులు అన్నారు. మంగళ వారం స్థానిక గడియార స్తంభం సెంటర్ వద్ద హెల్మెట్ వినియోగం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు డిఎస్పి రామాంజనేయులు, సీఐ అహ్మద్ జానీ, ఆర్టిఓ రంగారావు వాహన వినియోగదారులకు తగిన సూచనలు అందజేశారు. ఈ సందర్భంగా డిఎస్పి రామాంజనేయులు మాట్లాడుతూ హెల్మెట్ యొక్క ప్రాధాన్యతను



గూర్చి వివరించి హెల్మెట్ ధరించిన వారిని పూలతో అభినందించారు. సిఐ అహ్మద్ జానీ మాట్లాడుతూ హెల్మెట్ ధరించుటవలన మిమ్మల్ని మీరు రక్షించుకోవటమే కాకుండా మీ కుటుంబాలను కూడా కాపాడుకున్న వారవుతారని అలాగే ఓవర్టేక్ చేసేటప్పుడు సిగ్నల్ లైటు ఇచ్చి నిదానముగా ఓవర్టేక్ చేయాలని తెలియజేశారు. ఆర్టీవో రంగారావు మాట్లాడుతూ హెల్మెట్ అనేది మొబైల్ ఫోన్ కి మనం వేసే స్క్రీన్ కార్డు వంటిదని కాబట్టి అందరూ హెల్మెట్ ధరించాలని అదేవిధంగా ప్రతి ఒక్క వాహనదారుడు ఇన్సూరెన్స్ కట్టవలసిందిగా తెలియజేశారు.

## బసవనపల్లిలో పొలం పిలుస్తోంది కార్యక్రమం



అమరాపురం రాయల్ జర్నలిజం అక్టోబర్ 01: మండల పరిధిలోని బసవనపల్లి గ్రామం నందు పొలం పిలుస్తోంది కార్యక్రమం మండల వ్యవసాయ అధికారి మంజునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ అనుబంధ శాఖలు అధికారులు హాజరై వారి వారి శాఖల యందు జరుగుతున్న సంక్షేమ పథకాలను రైతులకు వివరించడం జరిగింది.హాజరైన అధికారులు మండల, సెరికల్చర్ అధికారి వేణుగోపాల్ నాయక్ , పశు సంవర్ధకశాఖ నుంచి సౌందర్య , రైతు సేవ కేంద్రాల అధికారులు సౌజన్య రాణి , గురు స్వామి గ్రామ సర్పంచ్ బసవన్నపల్లి సర్పంచ్ నరసింహమూర్తి, ఆలదపల్లి సర్పంచ్ ఈరన్న, మాజీ సర్పంచ్ పాండురంగ, పంచాయతీ కన్వీనర్లు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ లపై రాష్ట్రంలో జరుగుతున్న దాడులను అరికట్టాలి

రాయల్ జర్నలిజం మదనపల్లి అక్టోబర్ 1: మదనపల్లిలో బహుజన సమాజ్ పార్టీ నిర్వహించిన నిరసన ప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు, బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెల గౌతమ్ కుమార్ మరియు కొంతమంది బీఎస్పీ కార్యకర్తలను అదుపులోకి తీసుకొని కేసులు బనాయించినారు. ఇది అమానుషమని, అన్యాయమనీ, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఎస్పీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు ,యుగంధర్ అబ్బవరంపత్రికా ప్రకటన లో తెలిపారు.రాష్ట్రంలో టీడీపీ నాయకత్వం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత వైసీపీ పాలన కంటే అధికంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై దాడులు నమోదు అవుతున్నాయనీ, అధికారం లో వున్న పార్టీల ఎమ్మెల్యేలే స్వయంగా అట్రాసిటీలకు పాల్పడుతున్నారనీ,ఉండి నియోజకవర్గం శాసన సభ్యులు రఘురామకృష్ణరాజు డా.అంబేద్కర్ చిత్ర పటాన్ని తొలగించడం ద్వారా ఆయన ను అవమానించడం, కాకినాడ శాసన సభ్యులు పంతం నానాజీ దళిత డాక్టర్ పై దాడి చేయడంలాంటి సంఘటనలు చాలా ప్రమాదకరమైనవనీ, ముఖ్యంగా అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వంద రోజుల పాలనలో వంద దళితుల మీద దాడులు బాధితులకు తక్షణం న్యాయం చేయవలసినదిగా శ్రీ బందెల గౌతమ్ కుమార్ ఎంతో ప్రశాంతంగా రాజ్యాంగబద్ధంగా నిరసన తెలియజేస్తుంటే పోలీసులు నిర్దాక్షణంగా అదుపులోకి తీసుకొని, అక్రమ కేసులు బనాయించడం చాలా బాధాకరమని, చర్యలు తీసుకుని దళితులకు రక్షణగా నిలవవలసిన పోలీసులే ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని,ఇటువంటి సంఘటనలు జరుగకుండా అరికట్టవలసిన ప్రభుత్వం నిరసన తెలియజేసే వారిపై



కేసులు పెట్టడం సహించరాని విషయమనీ, గత ప్రభుత్వం అప్రజాస్వామిక చర్యలకు పాల్పడిందని ప్రచారం చేసి, అధికారంలోకి వచ్చిన టీడీపి కూటమి ప్రభుత్వం ఇప్పుడు అదే బాటలో నడవడం మంచి పద్ధతి కాదనీ,కనుక, ముఖ్యమంత్రి శ్రీ చంద్రబాబు నాయుడు తప్పు చేసిన శాసనసభ్యులపై చర్యలు తీసుకొని నిరసన తెలిపే వారిపై పెట్టిన కేసులు ఎత్తివేయాలని అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు యుగంధర్ అబ్బవరం డిమాండ్ చేశారు .భవిష్యత్తులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలపై దాడులు జరుగకుండా అరికట్ట వలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి ఆంజనేయులు రాజంపేట బీఎస్పీ రాజంపేట ఇన్చార్జి పేరు నరసింహులు, మద్ది రేవుల ఆంజనేయులు మహిళలు ప్రియా కొండమ్మ తదితరులు పాల్గొన్నారు

## వృద్ధుల సౌకర్యవంతమైన వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలి



రాయల్ జర్నలిజం ( బాపట్ల) అక్టోబర్ 1 : బావపూరి సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం మంగళవారం స్థానిక ఎన్జీ ఓ హోమ్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమమునకు ముఖ్యఅతిథిగా మున్సిపల్ కమీషనర్ వి. నిర్మల్ కుమార్ మరియు ఎన్టీఆర్ అవార్డు గ్రహీత కె. ఎస్ టి. సాయి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి జిల్లాలో 150 పడకలతో కూడిన సౌకర్యవంతమైన వృద్ధాశ్రమాలు ఏర్పాటు చేయాలని అదే విదంగా డే కేర్ సెంటర్లు, రవాణా చార్జీల్లో మరింత రాయితీ, ప్రయాణంలో వృద్దులకు ప్రత్యేక0గా సీట్లు కేటాయించాలని అన్నారు. బాపట్ల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కు ఒక భవనము, స్థలము కల్పించవలసినదిగా కమిషనర్ కు సీనియర్ సిటిజన్స్ మెమోరాండం సమర్పించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులు జీ.వి.బ్రహ్మం, కోటి సుబ్బారావు, దీవి. శ్రీనివాసమూర్తి, రావూరి నరసింహ వర్మ, పిఎస్ ఆనందకుమార్ తదితరులను ఘనంగా మెమెంటాలతో సత్కరించారు.కార్యక్రమంలో డాక్టర్ నరేష్ రెడ్డి, బొ లగాని వెంకటేశ్వర్లు, శాంతారామ్, సిద్దయ్య, బందా బాబు, పి.సి.సాయిబాబా, డాక్టర్ శ్రీనివాసులు, పి. చిన వీరరాఘవులు అమూల్యమైన సందేశం అందించారు.

## విద్యార్థులకు ఆటలతో ఆరోగ్యం

### క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

రాయల్ జర్నలిజం, రాయచోటి, అక్టోబర్1: విద్యార్థులకు ఆటలు ఆరోగ్యంతో పాటు మనో వికాసాన్ని కలిగిస్తాయని రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పరికరాల పంపిణీ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మడితాటి నరసింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పిల్లలకు నిత్యం కనీసం ఒక అరగంట నుంచి గంట పాటైన ఆటలు ఆడించాలన్నారు. ప్రస్తుతం ప్రతి పాఠశాలలో చదువుతోపాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. క్రీడల వల్ల శారీరక దారుఢ్యం అలవడుతుందన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమని క్రీడల పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపి ఆరోగ్యంగా ఉండాలన్నారు. క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. రాయచోటిలో క్రీడా పాఠశాలను ఏర్పాటు చేయడమే కాకుండా ఇండోర్ గేమ్స్ సదుపాయాలను కల్పిస్తామన్నారు. క్రీడలలో ప్రతిభ చూపిన వారికి విద్య, ఉద్యోగ అవకాశాల్లో రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. ఈ అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా సంబేపల్లి నివాసి అయిన ఎన్ఆర్ఐ భూషణం శశివర్మ లక్ష రూపాయల విలువ గల క్రీడా వస్తువులను సంబేపల్లి పాఠశాలకు ఇవ్వడం గొప్ప విషయం



అన్నారు. దాతలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు కూడా తాము పెరిగి పెద్దయిన తర్వాత సమాజం కోసం కొంచెం పాటుపడాలన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు పొందిన దేవప్రసాదరెడ్డిని దుశ్శాలవతో సత్కరించారు. ఏకలవ్య ఫౌండేషన్, చెకుముకి, స్వర్ణాంధ్ర విజన్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లను, బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లు నాగేశ్వర నాయుడు, శశిధర్ రెడ్డి, గోపాల్, ఓబిసి మోర్చా డిస్టిక్ ప్రెసిడెంట్ రేపన శివప్రసాద్, ఎన్నారై భూషణ్ శశివర్మ, మాజీ జెడ్పిటిసి నరసారెడ్డి, మాజీ ఎంపీటీసీ శివప్రసాద్ రెడ్డి, తెలుగుదేశం నాయకులు కొండ భాస్కర్ రెడ్డి, గొల్లపల్లి సుబ్బారెడ్డి, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ లు రెడ్డి రాణి, రెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## వారాహి సభను జయప్రదం చేయాలి



రాయల్ జర్నలిజం, సంబేపల్లి, అక్టోబర్ 1:- అన్నమయ్య జిల్లా రాయచోటి జనసేన పార్టీ సమన్వయకర్త మయాన మహమ్మద్ అలీ(పఠాన్) మాట్లాడుతూ జనసేన పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ అక్టోబర్ 1 తేదీన అలిపిరి ఘాటు నుంచి పాదయాత్ర ద్వారా తిరుమల 7 కొండలు చేరుకుని రెండవ రోజు శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని స్వామివారి ఆశీర్వాదం తీసుకొని 3వ తేదీ సాయంత్రం 4 గంటలకు తిరుపతిలో జరిగే వారాహి సభలో పాల్గొని ఆ సభలో రాష్ట్ర ప్రజలకు మంచి సందేశం ఇవ్వడం జరుగుతుంది ఈ వారాహి సభ ఒక జనసేన పార్టీకి సంబంధించింది కాదు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సభలో సందేశాలు ఇవ్వడం జరుగుతుంది కావున రాయచోటి నియోజవర్గం జనసేన పార్టీ 6 మండలాల నుంచి జనసేన నాయకులు కార్యకర్తలు అభిమానులు వీర మహిళలు అందరూ బయలుదేరి తిరుపతి వారాహి సభకు వెళ్లి సభను విజయవంతం చేయాలని కోరారు.

## బసవన్నపల్లి పంచాయతీ కార్యదర్శి గోపాలకృష్ణ మృతికి సంతాపం

అమరాపురం రాయల్ జర్నలిజం అక్టోబర్ 01:మండల పరిధిలోని బసవనపల్లి గ్రామ పంచాయతీ నందు పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న యం డి గోపికృష్ణ సోమవారం సాయంత్రం ఆకస్మిక మరణం పొందిన నేపథ్యంలో ఈ రోజు అనంతపురం లో వారి స్వగృహంనందు వారికి నివాళి అర్పించి ప్రభుత్వం తరపున ఇవ్వాల్సిన అంత్యక్రియలు ఖర్చులు అందజేసి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం ఇచ్చి ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్నీ సదుపాయాలు అందించుటలో తోడ్పాటు ఉంటామని అమలాపురం మండలం తోటి పంచాయతీ కార్యదర్శులు వారితోపాటు ఈవో ఆర్ డి నాగ ముని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల విస్తరణ అధికారి (పం.రా %ఢ% (గ్రా.అ) శ్రీ నాగముని పంచాయతీ కార్యదర్శి లు నరేష్ బాబు , ఈరన్న, జీవ రత్నం తదితరులు కీర్తి శేషులు



శ్రీ గోపి క్రిష్ణ(పంచాయతీ కార్యదర్శి, బసవనపల్లి) అంత్యక్రియలు కార్యక్రమంలో పాల్గొని వారికి సంతాపం తెలియజేసినట్లు వారు తెలిపారు. వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పంచాయతీ కార్యదర్శులు పేర్కొన్నారు.

## అక్టోబర్ 3 న మంత్రి చేతుల మీదుగా వీరభద్రయ్య విగ్రహావిష్కరణ



రాయల్ జర్నలిజం, సంబేపల్లి, ఆగస్టు 1:-మాజీ మున్సిపల్ ఛైర్మన్ కీర్తిశే షులు డి.వీరభద్రయ్య విగ్రహాన్ని ఎ.పి వడ్డెర విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో ఈనెల 3న ఆయన స్వగ్రామమైన మాధవరం వడ్డెపల్లె లో ఏర్పాటు చేయనుంది.రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి చేతులమీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి విశిష్టఅతిథిగా కర్నాటక చిత్రదుర్గం వడ్డెర గురుపీఠం శ్రీ జగద్గురు సిద్ధరామేశ్వర సంస్థాన్ పీఠాధిపతి జగద్గురు శ్రీసిద్ధరామేశ్వరమహాస్వామీజీ హాజరవుతున్నట్లు వారుతెలిపారు.అత్యంత వెనుకబడ్డ రాయచోటి నియోజ కవర్గంలోని మారుమూల గ్రామ మైన మాధవరంలో నిరుపేద కుటుంబంలో జన్మించిన ఆయన కష్టపడి ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ ఉద్యోగం చేస్తూనే అత్యం త వెనుకబడ్డ తన సామాజికవర్గ మైన వడ్డెరజాతి చైతన్యంకోసం అహర్నిశలు కృషిచేశారన్నారు.డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ గా పదవీవిరమణ అనంతరం రాజకీయాలలో అడుగు పెట్టిన ఆయన అనతి కాలంలోనే కొత్తగా ఏర్పాటైన రాయచోటి మున్సిపాలిటీకి 2005 వసంవత్సరంలో మొట్టమొదటి చైర్మన్ గా ఎన్నికయ్యారన్నారు.

## శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాదరెడ్డి



రాయల్ జర్నలిజం రాయచోటి, అక్టోబరు - 1:రాయచోటి పట్టణం నందలి శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర స్వామిని మంగళవారం ఉదయం రాష్ట్ర రవాణా క్రీడా శాఖ మంత్రివర్యులు మండిపల్లి రాంప్రసాదరెడ్డి దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు.దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయం ప్రకారం జిల్లా దేవాదాయ అధికారి, ఆలయ ఈవో, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం, వేదమంత్రోచ్చారణలతో మంత్రివర్యులను ఆలయంలోకి తీసుకెళ్లారు. తొలుత ఆలయంలో పరివార దేవతలను మంత్రి దర్శించుకున్నారు. పిదప శ్రీ వీరభద్ర స్వామి, భద్రకాళి అమ్మవారికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. అన్నమయ్య జిల్లా సుభిక్షంగా ఉండాలని. అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలని స్వామి, అమ్మవార్లను వేడుకున్నారు. అనంతరం ఆలయ మండపంలో అర్చకులు తీర్థ ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేశారు. జిల్లా దేవాదాయ శాఖ అధికారి, ఆలయ ఈఓ ఆలయ విశిష్టతను వివరించి, మంత్రిగారికి దసరా ఉత్సవాల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఆలయంలో అర్చకులు, సిబ్బంది తమ రెగ్యులరైజేషన్ అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ఉన్నతాధికారులతో మాట్లాడి నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని మంత్రి వివరించారు. ఈ సందర్భంగా రాయచోటి నియోజకవర్గంలో ఉన్న ఆలయాలలో ధూప దీప నైవేద్యం, శ్రీవాణి ట్రస్టు నిధుల కింద ఉన్న దేవాలయ వివరాలు, సర్వ శ్రేయోనిధి ద్వారా జరిగే అభివృద్ధి పనులు, దేవాలయాల ఆస్తులు, వాటి స్థితిగతుల వివరాలను జిల్లా దేవాదాయ శాఖ అధికారి వివరించారు. శ్రీ వీరభద్ర స్వామి గుడి ఎదురుగా ట్రాన్స్ఫార్మర్ ఉండడంతో ఇబ్బందులు, సమస్యలు ఏర్పడుతున్నట్లు ఆలయ ఈఓ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి ట్రాన్స్ఫార్మర్ సమస్యను పరిష్కరిస్తామని మంత్రి సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి డివి రమణారెడ్డి, జిల్లా దేవాదాయ శాఖ అధికారి విశ్వనాథ్, మున్సిపల్ కమిషనర్ వాసు బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## Election of Gedi Chiranjeevi as the in-charge of Malamahanadu Piler Constituency

Royal Journalism,“(Valmikipuram), October 01:““When National Working President Yamala Sudarshan visited Valmikipuram to decide the new mandal committee, Gedi Chiranjeevi from Chintaparthi was elected as the in-charge of Piler Constituency Malamaha nadu.“Piler Constituency Incharge has been entrusted with the responsibility of 6 Mandals namely Piler, KV Palli, Kalakada, Kalikiri, Valmikipuram and Gurramkonda. Gedi Chiranjeevi said that National Working President Yamala Sudarshanam has trusted me.“First in 2015 as Chintaparthi village president, in 2020 as chief secretary of Valmikipu ram mandal, in 2022 as honorary president of mandal, in 2023 as mandal president and now in 2024 as in-charge of Piler constituency.“He informed that he will carry out the responsibilities assigned to him properly and work for the growth of the constituencies and if injustices and irregularities are done to the constituencies, he will fight for justice with integrity. He congratulated the new executive committee of Mandal.

రాయల్ జర్నలిజం ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# ప్రభుత్వ చౌక దాన్యపు డిపోల్లో కంది బ్యాళ్లు పంపిణీ

అమరాపురం రాయల్ జర్నలిజం అక్టోబర్ 01- సత్య సాయి జిల్లా మడకశిర నియోజకవర్గం అమరాపురం మండల కేంద్రంలోని 11వ చౌక ధరల దుకాణంలో మంగళవారం బియ్యం తో పాటు కందిబేళ్ళను, జొన్న మరియు చక్కెర పంపిణీ చేశారు. గత కొన్ని నెలలుగా కందిబేళ్లు పంపిణీ జరగలేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు కంది బెల్లు పంపిణీ చేసినట్లు లబ్ధిదారులు తెలిపారు. ఈ నెల కోటా నుండీ పంపిణీ చేయడం జరిగిందని 11వ ఎఫ్పి షాప్ డీలరు జి. నాగరత్నమ్మ తెలిపారు. ఇకపై ఎఫ్పీ షాప్ లో అన్ని రకాల నిత్యవసర సరుకులు సకాలంలో అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రేషన్ కార్డు లబ్ధిదారులు పాల్గోన్నారు.



## ఘోర రోడ్డు ప్రమాదం 40మందికి గాయాలు





కురబలకోట రాయల్ జర్నలిజం:-మండలంలో ని సర్కారుతోపు జాతీయ రహదారి పై ఘోర రోడ్డు ప్రమాదం సమాచారం అందుకున్న ముదివేడు పోలీసులు ఎస్ ఐ దిలీప్ కుమార్ తన సిబ్బంది తో ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను దాదాపు 40మందికి పైగా మదనపల్లి జిల్లా ఆసుపత్రికి 108లద్వారా,ప్రవేటు వాహనాల ద్వారా తరలించారు. గాలివీడు నుంచి మదనపల్లి కు వెళుతున్న ఆర్టీసీ బస్సును లారీ డి కొనడమం వలన ఆర్టీసీ డ్రైవర్ కృష్ణయ్య ను జె సి బి సహాయం తో బయటకు తీసినారు. తీవ్రంగా గాయపడంతో. ఆయనను బెంగళూరు కు తరలించడం జరిగింది. అలాగే బస్సు వెనుకాల ఉన్న ద్విచక్ర వాహన దారుని సుబ్బయ్య పై బస్సు వెళ్లడం తో తీవ్రంగా గాయపడ్డారు. ముదివేడు ఎస్ ఐ దిలీప్ కుమార్,ఏ ఎస్ ఐ గజేంద్ర, హెడ్ కానిస్టేబుల్ మహేశ్వర రావు కానిస్టేబుల్ రవీంద్ర నాయక్,శ్రీనివాసులు ఆనంద్, స్థానిక ప్రజలు వచ్చి క్షతగాత్రులను జిల్లా ఆసుపత్రికి తరలించారు.

## అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవు : ఎస్సై



రామసముద్రం అక్టోబర్ 1 రాయల్ జర్నలిజం: మండలంలో ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక అక్రమరవాణా చేస్తే అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై వెంకటసుబ్బయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మంగళవారం పాత్రికేయులతో మాట్లాడు తూ మండలం లోని చెంబకూరులోని మూడు రోడ్డులో మంగళవారం రాత్రి ఇసుక ట్రిప్పర్ లో తరలిస్తున్న ట్లు సమాచారం రావడంతో అక్కడకి వెళ్లి ట్రిప్పర్ పట్టుకోవడం జరిగింది. ట్రిప్ప ర్ ని సీజ్ చేశామనితెలిపారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వం నిర్ణయించిన రీచ్ ల ద్వారా ఇసుక తెచ్చుకోవచ్చని ఎక్కడ పడితే అక్కడ ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. రీచ్ నుంచి వచ్చే వాహనాలకు రసీదు తప్పనిసరిగా ఉండాలన్నారు. ట్రిప్పర్ ఓనర్ గంగరాజు, డ్రైవర్ ప్రసాద్, బ్రోకర్ ప్రకాష్ మేస్త్రి వెంకటేష్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ముగిసిన చెకుముకి సైన్స్ సంబరాలు



రామసముద్రం. అక్టోబర్ 01రాయల్ జర్నలిజం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి చెకుముకి పరీక్ష విజయవంతంగాముగిసిందని ప్రధానో పాధ్యాయులు చిట్టిబాబు అన్నారు. ఈ పరీక్షకు రామసముద్రం మండలంలోని చెంబకూరు, మట్లవారిపల్లి , రామసముద్రం, మోడల్ పాఠశాల, కెజిబివి, పాఠశాలల నుండి 15 మంది విద్యార్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు. మండల స్థాయిలో మొదటి స్థానం పొందిన చెంబకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎం.గణేష్, సాయి సుదీప్, మరియు కెజిబివి చిత్రావతి లు మొదటి స్థానంలో నిలిచారు. ద్వితీయ స్థానంలో రామసముద్రం విద్యార్థులు నిలిచారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థులు జిల్లాస్థాయి చెకుముకి పోటీలకు అర్హత సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథంపొందించేందుకు ఈ పరీక్ష దోహదపడుతుందని తెలిపారు. ఈ నెల 27న రాయచోటిలోని డైట్ కళాశాలలో జిల్లాస్థాయి చెకుముకి పరీక్షలో వీరు పాల్గొననున్నట్లు తెలిపారు.

## చట్టాలపై ప్రతి ఒకరికి అవగాహన అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు : డిఎస్పీ



రామసముద్రం అక్టోబర్ 1 రాయల్ జర్నలిజం. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ను మంగళవారం మదనపల్లి డి ఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు తనిఖీ చేశారు. స్టేషన్ రికార్డులను పరిశీలించి పలు కేసుల వివరాలు అడిగి తెలుసు కున్నారు. డిఎస్పీ మాట్లాడుతూ అసాంఘిక కార్యాక్రమాలకు పాల్పడినా,రౌడీయుజం గుండా యుజం ప్రోత్సహించిన ఉపేక్షించేది లేదని డి ఎస్పీ హెచ్చరించారు. మండల పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలను కాపాడేందుకు. పోలీస్ సిబ్బంది ముందుంటారన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. జనజీవానికి ఆటంకాలు లేకుండా చూసేందుకు పోలీస్ సిబ్బంది. అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలం లోని కర్ణాటక సరిహద్దులోని చెక్ పోస్ట్ వద్ద ప్రత్యేక పోలీస్ లను పెట్టామని డి ఎస్పీ తెలిపారు. అక్రమ మద్యం, జూదం పై నిఘా ఉంచామన్నారు. కొత్త వ్యక్తుల రాకపోకలపై ప్రత్యేక ద్రుష్టి ఉంచి. ఎలాంటి సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత పోలీస్ లపై ఉందన్నారు. ఈ తనిఖీల్లో డి ఎస్పీ దర్బార్ కొండయ్య నాయుడు సీఐ కె రమేష్ తో పాటు ఎస్సై వెంకటసుబ్బయ్య పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో నూతన మద్యం పాలసీ - 2024 అమలు

రాయల్ జర్నలిజం రాయచోటి అక్టోబర్ 01:అన్నమయ్య జిల్లాలో నూతన మద్యం పాలసీ 2024 అమలులోకి రానున్న సందర్భంగా జిల్లాలో 111 మద్యం షాపులకు అక్టోబరు 9 సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని, జనాభా ప్రాతిపదికన లైసెన్స్ రుసుము నిర్ణయించబడుతుందని, జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాత్రికేయుల సమావేశంలో తెలిపారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు నూతన మద్యం పాలసీ 2024 పై జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి పాత్రికేయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ. నూతన మద్యం పాలసీపై రాష్ట్ర ప్రభుత్వం జీవో 211 ను విడుదల చేసిందని, ఈ జీవోలోని నిబంధనల మేరకు మద్యం షాపుల ఏర్పాటు మరియు నిర్వహణ ఉండబోతుందని తెలిపారు. అన్నమయ్య జిల్లాకు సంబంధించి 111 షాపులకు అక్టోబర్ 1న నోటిఫికేషన్ విడుదల అయిందని, అక్టోబర్ 9 సాయంత్రం 5 గంటల వరకు ఆన్లైన్లో గాని, ఆఫ్ లైన్ లో గాని, దరఖాస్తుల స్వీకరణ ఉంటుందని తెలిపారు. అక్టోబర్ 11 వ తారీకున గౌరవ జిల్లా కలెక్టర్, లాటరీ పద్ధతి ద్వారా మద్యం షాపుల ఏర్పాటుకు ఎంపిక కాబడిన దరఖాస్తులను ఖరారు చేస్తారన్నారు. మద్యం షాపుల ఏర్పాటుకు



ఔత్సాహికులు ముందుకు వచ్చి దరఖాస్తు చేసుకోవచ్చని ఈ సందర్భంగా తెలిపారు. నూతన మద్యం పాలసీలోని ముఖ్య అంశాలు. ఒక వ్యక్తి ఎన్ని షాపులకైనా, ఎన్ని దరఖాస్తులైనా చేసుకోవచ్చు. ప్రతి దరఖాస్తు తో పాటు రెండు లక్షల రూపాయల దరఖాస్తు రుసుమును చెల్లించాలి. లైసెన్స్ రుసుము తిరిగి వెనుకకు ఇవ్వబడదు. లైసెన్సు రుసుమును జనాభా ప్రాతిపదికన నిర్ణయించబడుతుంది. ప్రతి సంవత్సరం లైసెన్సు రుసుము 10% పెంచబడుతుంది. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి మధుసూదన్, తదితరులు పాల్గొన్నారు.

# రైతులు గ్రూపులుగా ఏర్పడి కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసుకుని మార్కెటింగ్ చేసుకోవచ్చు

### జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎస్ ఎస్ వి సుభాషిని



చెన్నూరు, రాయల్ జర్నలిజం అక్టోబర్ 1, రైతులు వారితోపాటు టమాట ఇతర కూరగాయలు, పండ్ల తోటలు వంటివి సాగు చేసుకుని అధిక ఆదాయం పొందాలని, రైతులు గ్రూపులుగా ఏర్పడి కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసుకొని మార్కెటింగ్ చేసుకోవచ్చునని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి యశస్వి సుభాషిని తెలిపారు. బుధవారం ఆమె మండలం లోని కనపర్తి, అలాగే చెన్నూరు-3, రైతు భరోసా కేంద్రాల పరిధి లలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఎస్ ఎస్ వి సుభాషిని రైతులతో మాట్లాడుతూ, రైతులు వరి తో పాటు టమాట ఇతర కూరగాయలు, పండ్ల తోటలు వంటివి సాగు చేసి అధిక ఆదాయం పొందాలని తెలిపారు. అదే విధంగా రైతులు గ్రూపులుగా ఏర్పడి కలెక్షన్ సెంటర్లు ఏర్పాటు చేసుకొని మార్కెటింగ్ చేసుకోవచ్చున్నారు. మండల వ్యవసాయ అధికారి కే శ్రీదేవి మాట్లాడుతూ, రైతులు పై పాటుగా కాంప్లెక్స్ ఎరువులు( పాస్పెట్) వాడకూడదని వీటిని దుక్కిలో మాత్రమే వాడాలని తెలిపారు. యూరియా, పొటాష్ ఎరువులు వంటి సూటి ఎరువులను మాత్రమే పై పాటుగా వేసుకోవాలని తెలియజేశారు. హార్టికల్చర్ అధికారి జ్యోతిర్మయి మాట్లాడుతూ, 20 ఏళ్లు మించిన మామిడి తోటలను కత్తిరింపులు, (టాపింగ్) చేసుకునే రైతులకు రూ, 15వేల వరకు నగదు ఇవ్వడం జరుగుతుందని తెలియజేశారు. డ్రిప్ ఇరిగేషన్ అధికారి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ, 90 శాతం రాయితీతో డ్రిప్ పెట్టుకొని పసుపు వంటి పంటలలో తక్కువ నీటి ఖర్చుతో అధిక దిగుబడి పొందవచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మా అగ్రికల్చర్ అసిస్టెంట్ మహమ్మద్ రఫీ, డి. చరణ్ కుమార్ రెడ్డి , యు. సృజన, రైతులు పాల్గొన్నారు.

# పేద బడుగు బలహీన వర్గాలు గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకే ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు

చెన్నూరు, రాయల్ జర్నలిజం,అక్టోబర్ 1 , సమాజంలో పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం వారి అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని అందుకే వారి జీవితాల్లో ఆనందం నింపడానికే ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా సామాజిక పెన్షన్లను ప్రతి నెల ఒకటవ తేదీన తెల్లవారక ముందే వారి ఇంటికి వెళ్లి తలుపు తట్టి మరి పింఛన్లు పంపిణీ చేయడం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ నాయకులు ముండ్ల నరసింహారెడ్డి, నరసింహ ఆచారి లు అన్నారు. మంగళవారం వారు ఎమ్మెల్యే కృష్ణ చైతన్య రెడ్డి ఆదేశాల మేరకు గ్రామ సచివాలయ సిబ్బందితోపాటు టిడిపి కార్యకర్తలను కలుపుకొని గ్రామ పంచాయితీ లోని అర్హులు గల ప్రతి ఇంటికి వెళ్లి పెన్షన్ ఇచ్చే కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ముండ్ల నరసింహారెడ్డి, నరసింహాచారి లు మాట్లాడుతూ, గ్రామంలోని అవ్వాతాతలు, వితంతువులు అలాగే వైకల్యం కలిగి ఉన్నవారిని కలిసి ఆప్యాయంగా పలకరించి వారికి యోగక్షేమాలు తెలుసుకొని పెన్షన్ అందిస్తుంటే, వారు పొందిన ఆనందం మాటల్లో చెప్పలేనివని వారు తెలిపారు. ప్రతి అవ్వ తాత ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వారు అభినందిస్తూ ఆశీర్వదిస్తుంటే ఆ ప్రేమ, ఆ ఆప్యాయత, ఆ అనురాగం వెలకట్టలేనివని వారు తెలియజేశారు. నేరుగా తమ ఇంటి వద్దకే స్వయంగా అధికారులు, డిపి నాయకులు వచ్చి పింఛన్ అందజేయడంతో లబ్ధిదారులు ఉబ్బితబ్బివడంతో పాటు... ప్రభుత్వం తమకు భరోసాగా నిలుస్తోందని, పింఛన్ సొమ్ముతో గౌరవప్రదమైన జీవితాన్ని పొందగలుగుతామని, ఇది మంచి ప్రభుత్వమని తమసంతోషాన్ని వ్యక్తం చేశారని వారు తెలిపారు. సమాజంలోని



అన్ని వర్గాల సంక్షేమం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు పింఛను మొత్తాన్ని పెంచి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేద బడుగు బలహీన వర్గాలకు అండగా నిలుస్తున్నారని వారు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, బలహీనులు, వితంతువులు అంగ వైకల్యం కలిగిన వారి కష్టాలను తీర్చి, గౌరవప్రదమైన జీవితాన్ని పొందేందుకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రభుత్వం అందజేస్తోందని వారు తెలిపారు. ఈ బృహత్తర కార్యక్రమ లక్ష్యాన్ని సాధించేందుకు ఆర్థిక పరిస్థితులు సవాలుగా ఉన్నప్పటికీ ఎన్టీఆర్ భరోసా పింఛన్లను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచి ఏప్రిల్ 2024 నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్నదని., అలాగే దివ్యాంగులకు రూ.6 వేలకు కు పెంచారని, పూర్తిస్థాయిలో వైకల్యానికి గురైన వారికి నెలకు రూ 15 వేలు పింఛను, కిడ్నీ తలసేమియా వంటి దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు నెలకు రూ.10 వేలు పింఛను ప్రభుత్వం అందజేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

## ఖైదీలకు వాటర్ బాటిల్స్ వితరణ చేసిన మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు



రాయల్ జర్నలిజం కడప అక్టోబర్ 1: అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూక్ షుబ్లీ సూచనల మేరకు కడప కేంద్ర కారాగారంలో ఖైదీలుగా ఉన్న వారికి సౌకర్యార్థం కేంద్ర కారాగార అధికారులు సమితి అధ్యక్షులను సంప్రదించగా మానవతా ధృక్పథ్యంతో కడప కేంద్ర కారాగారంలోని ఖైదీలకు సౌకర్యంగా వాటర్ బాటిల్స్ ను సమితి సభ్యుల ఆధ్వర్యంలో కారాగార అధికారి రామకృష్ణకు అందించారు. నాడు వైసీపీ రాక్షస పాలనలో మోసపోయిన ఓ మైనారిటీ కుటుంబాన్ని సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూక్ షుబ్లీ ఓదార్చి, ధైర్యం చెప్పడానికి కడప జిల్లా వస్తున్నప్పుడు అన్యాయంగా అడ్డగించి, తప్పుడు కేసులు బనాయించి కడప కేంద్ర కారాగారంలో వేయడం జరిగిన ఘటన అందరికీ తెలిసిందే. ఈ నేపథ్యంలో సమితి అధ్యక్షులు షుబ్లీ కారాగారంలో ఖైదీలు పడుతున్న అవస్థలు, కష్టాలు కళ్ళారా చూసి ఖైదీలకు సాంధ్యరభానుసారంగా రంజాన్ నెల సందర్భంగా పండ్లు, ఫలహారాలు, అలాగే ఖైదీలకు మానసికంగా, అధ్యాత్మికంగా ధైర్యంగా ఉండేందుకు ధార్మిక గురువులతో ఉపన్యాస కార్యక్రమలను చేపట్టడం, ఖైదీలు చెల్లించాల్సిన జరిమానలాను సైతం సమితి తరపున చెల్లించడం జరుతోందని సమితి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా కేంద్ర కారాగార అధికారులు మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర వ్యాప్తంగా చేపడుతున్న సేవలు అభినందనీయమని, మొన్న విజయవాడలో వరదల సమయంలో సమితి సేవలు అమూల్యమైనదని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కడప కేంద్ర కారాగార అధికారి రామకృష్ణతో పాటు సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఇఫ్తేకార్ జమాల్, రుబీనా, అన్వర్, సిద్దిఖ్, ఇర్షాద్, బాబ్జీ, నిజాం పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాదును ఘనంగా సత్కరించిన జననేత కృష్ణ



సిద్ధవటం రాయల్ జర్నలిజం అక్టోబర్1:సిద్ధవటం గ్రామ నివాసి రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మంగళవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుమల పర్యటన సందర్భంగా ప్రాయశ్చితి దీక్షకు మద్దతుగా విచ్చేసిన జనసేన పార్టీ ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాదును మర్యాదపూర్వకంగా శాలవుతో సత్కరించిన రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు అతి కారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా రాష్ట్ర నాయకులు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ తిరుమల యాత్ర సజావుగా జరగాలని గత వైసిపి ప్రభుత్వం లో కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ప్రసాదంలో కల్తీ వ్యవహారంలో వైకాపా మోసాన్ని ప్రజలు గమనించాలని భక్తుల మనోభావాలు దెబ్బ తినే విధంగా లడ్డూ వ్యవహారం కల్తీ చేశారంటే వీరిని ఏమనాలో ఒకసారి ప్రజలు ఆలోచించాలని మా డిప్యూటీ సీఎం పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుల భరతం కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి చూసుకుంటాడని తెలియజేశారు రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే ఏడుకొండల వెంకటేశ్వర స్వామి ఆలయం పవిత్రత పూర్తిగా దెబ్బ తినేది అని అన్నారు ఈ కార్యక్రమంలో సిద్దవటం ఒంటిమిట్ట మండల జనసేన పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు

## కిటికీచువ్వలు విరగొట్టి నగదు, బంగారు, వెండి దోచుకెళ్లిన దుండగులు



చెన్నూరు, రాయల్ జర్నలిజం,అక్టోబరు ,1: తాళం వేసిన ఇండ్ల పైనే దృష్టి పెట్టిన దుండగులు మండలంలో జోరుగా చోరీలకు తెగబడుతున్నారు. ఇటీవల మండలంలోని రామనపల్లి గ్రామంలో పట్టపగలే ఒక మహిళ మెడలోని బంగారు గొలుసు లాకెళ్ళిన సంఘటన మరువకముందే మంగళవారం చెన్నూరు పాత బ్యాంకు వీధిలో మరో దొంగతనం సంఘటన చోటు చేసుకుంది. చెన్నూరు పాత బ్యాంకు వీధిలో నివాసం ఉంటున్న పెడబల్లె రాజేశ్వరమ్మ అనే మహిళ ఇంటిలో దొంగలు చొరబడి ఇంటిలో ఉ-న్న బంగారు, నగదు, వెండి దోసుకెళ్లినట్లు పోలీసు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చెన్నూరు పాత బ్యాంకు వీటికి చెందిన పెడబల్లె రాజేశ్వరమ్మ భర్త మృతి చెందడంతో ఆమె ఒక్కటే ఒంటరిగా ఇంట్లో ఉండలేక తన కుమారుడు హైదరాబాదులో ఉండడంతో ఆమె కుమారుని వద్ద ఉండేదని తెలిపారు. అయితే రాజేశ్వరమ్మ ప్రభుత్వం ఇచ్చే సామాజిక వితంతు పెన్షన్ కొరకు ప్రతి నెల ఇంటికి వచ్చి పెన్షన్ తీసుకుని వెళ్లేదని తెలిపారు. అదే క్రమంలో అక్టోబర్ 1వ తేదీన హైదరాబాద్ నుండి ఇంటికి వచ్చిన రాజేశ్వరమ్మ ఇంటి తాళం తీసి ఇంటిలోకి వెళ్ళగా ఇంట్లో సామానులు, బట్టలు చల్లాచదురుగా పడి ఉండడం చూసి కంగా రుగా ఇంటిలోని బీరువాను పరిశీలించగా బీరువా పగలగొట్టి బీరువాలో ఉన్న 80 వేల రూపాయలు నగదు, 50 గ్రాముల బంగారు నగలు, అలాగే ఒకటిన్నర కేజీ వెండిని దొంగలు దోసుకెళ్ళినట్లు ఆమె గుర్తించడం జరిగిందన్నారు. దుండగులు ఇంటి కిటికీచు వ్వలు తొలగించి ఇంటిలోకి ప్రవేశించి దొంగతనానికి పాల్పడ్డారని తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంటనే ఇంటిని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# భరతజాతి గుండె చప్పుడు మహాత్మాగాంధీ



రాయ జర్నలిజం,సంబేపల్లి, అక్టోబర్ 1:-భరతిజాతి గుండె చప్పుడు మహాత్మా గాంధీ అని వైఎస్ఆర్ సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ,మాజీ ఎంఎల్ఏ గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు.సత్యము, అహింసలు గాంధీజీ నమ్మిన సిద్ధాంతాలని,సహాయ నిరాకరణ, సత్యాగ్రహము ఆయన ఆయుధాలని, కొళాయికట్టి , చేత కర్ర పట్టి ,నూలు ఒడికి, మురికి వాడలు శుభ్రం చేసి,అన్నీ మతాలు ఒక్కటేనని చాటి చెప్పి రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్య పాలనకు చమరగీతం పాడారన్నారు.లాల్ బహదూర్ శాస్త్రి దేశ రెండవ ప్రధానిగా భారతీయుల హృదయాలలో నిలిచిన అమరజీవి అని అన్నారు. అత శత్రువుగా పేరు పొందిన ఆయననే పదవులు వరించాయన్నారు.మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల దేశభక్తి, చిత్తశుద్ధి, నిజాయితీ ,సేవా భావాలు అందరికీ ఆదర్శం కావాలని ఆకాంక్షించారు. ఆ మహనీయుల అడుగుజాడల్లో నడచి వారి ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.గాంధీజీ కలలు కన్న గ్రామస్వరాజ్యానికి గత జగన్ ప్రభుత్వం కృషి చేసిందన్నారు.జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందన్నారు. తమ హయాంలో పట్టణంలోని కలెక్టరేట్ వద్ద గాంధీజీ విగ్రహంతో పాటు జాతీయ రహదారిపై మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆ మహనీయుల జయంతుల సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి నివాళులు అర్పించారు.

# తిరుమలలో కీలక ఘట్టం



అమరావతి : తిరుమలలో భక్తుల రద్దీ నెలకొంది. శుక్రవారం నాడు 66,986 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. వారిలో 26,163 మంది తలనీలాలు సమర్పించారు.తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆ ఒక్క రోజే హుండీ ద్వారా 5.05 కోట్ల రూపాయల ఆదాయం తిరుమల తిరుపతి దేవస్థానానికి అందింది.వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. కిటకిటలాడాయి. ట్రావెలర్స్ బంగళా వరకూ క్యూ లైన్ ఏర్పడింది. టోకెన్ లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 18 నుంచి 20 గంటల సమయం పట్టింది. కంపార్ట్‌మెంట్లల్లో ఉన్న వారికి టీటీడీ సిబ్బంది అన్నప్రసాదాలు, మజ్జిగ, మంచినీరు, అల్పాహారాన్ని పంపిణీ చేశారు.అక్టోబర్ 4 నుంచి 12వ తేదీ వరకు తిరుమలలో నవహ్నిక సాలకట్ల బ్రహ్మోత్సవాలను వైభవంగా జరుగనున్నాయి. అక్టోబర్ 3వ తేదీ సాయంత్రం అంకురార్పణతో ఈ ఉత్సవాలు ప్రారంభమౌతాయి. బ్రహ్మోత్సవాల్లో ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 7 గంటల నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి.4వ తేదీన సాయంత్రం 5:45 నుంచి 6 గంటల వరకు వేదమంత్రోచ్చారణల మధ్య ధ్వజారోహణం చేస్తారు శ్రీవారి అర్చకులు. రాత్రి 9 గంటలకు శ్రీమలయప్ప స్వామివారిని పెద శేష వాహనంపై ఊరేగిస్తారు. 5న ఉదయం 8 గంటలకు చిన్న శేష వాహనం, మధ్యాహ్నం 1 నుంచి 3 గంటల వరకు స్నపనం, రాత్రి 7 గంటలకు హంస వాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమల శ్రీవారి ఆలయంలో కోయిల్ అళ్వార్ తిరుమంజనం కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు టీటీడీ అధికారులు. ఈ తెల్లవారు జామున 6 గంటలకు శుద్ధి కార్యక్రమం ఆరంభమైంది. ఉదయం 10 గంటలకు వరకు కొనసాగింది.టీటీడీ కార్యనిర్వాహణాధికారి జే శ్యామలరావు, అదనపు ఈఓ వెంకయ్య చౌదరి, చీఫ్ విజిలెన్ అధికారి శ్రీధర్, ఆలయ అర్చకులు ఇందులో పాల్గొన్నారు. ఆనందనిలయం, ధ్వజస్తంభం, బంగారువాకిలి, శ్రీవారి ఆలయం లోపల ఉప ఆలయాలు, ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి.. తదితర అన్ని వస్తువులను నీటితో శుభ్రం చేశారు.ఆ సమయంలో స్వామివారి మూలవిరాట్టును వస్త్రంతో పూర్తిగా కప్పి ఉంచారు. శుద్ధి అనంతరం నామకోపు, శ్రీచూర్ణం, కస్తూరి పసుపు, పచ్చాకు, గడ్డ కర్పూరం, గంధం పొడి, కుంకుమ, కిచిలిగడ్డ తదితర సుగంధ ద్రవ్యాలు కలగలిపిన పవిత్ర పరిమళ జలాన్ని ఆలయమంతటా ప్రోక్షణం చేశారు.అనంతరం స్వామివారి మూలవిరాట్టుకు కప్పిన వస్త్రాన్ని తొలగించి ప్రత్యేకపూజ, నైవేద్యం కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి శ్రీవారి దర్శనానికి భక్తులకు అనుమతి ఇచ్చారు.సంవత్సరంలో నాలుగుసార్లు అంటే- ఉగాది, ఆణివార ఆస్థానం, బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి పర్వదినాల ముందు వచ్చే మంగళవారం నాడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం నిర్వహించడం ఆనవాయితీ. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని అష్టదళ పాద పద్మారాధన, వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసిన విషయం తెలిసిందే.

# ఏపీఎస్ఆర్టీసీ గుడ్ న్యూస్

అమరావతి : ఇంకో రెండ్రోజుల్లో దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా ఆరంభం కానున్నాయి. రెండు తెలుగు రాష్ట్రాలు పండగ శోభను సంతరించుకుంటోన్నాయి. అమ్మవారి ఆలయాలన్నీ ముస్తాబవుతున్నాయి.లక్షలాది మంది భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు పూర్తయ్యాయి.ఈ నెల 3వ తేదీన దసరా పండగ మొదలు కాబోతోంది. 12వ తేదీన విజయదశమి. ఈ పండగలో భాగంగా ఇప్పటికే రెండు తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా సెలవులను ప్రకటించాయి. ఈ క్రమంలో ఇక బస్సులు, రైళ్లకు ప్రయాణికుల తాకిడి ఏర్పడబోతోంది.ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏపీఎస్ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను నడిపించనున్నారు. మొత్తం 6,100 బస్సులను అదనంగా ప్రయాణికుల కోసం అందుబాటులోకి తీసుకుని రానున్నారు. తిరుమలతో పాటు ప్రముఖ పుణ్యక్షేత్రాలు, పర్యాటక ప్రాంతాలకూ ప్రత్యేక బస్సులను నడిపించనున్నారు. సాధారణంగా పండగ సమయాల్లో ప్రవేశపెట్టే అదనపు బస్ సర్వీసుల్లో 50 శాతం మేర అదనపు ఛార్జీలను వసూలు చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది కూడా దీనికి బ్రేక్ పడింది. ప్రత్యేక బస్సుల్లో అదనంగా ఎలాంటి ఛార్జీలు వసూలు చేయకూడదని ఏపీఎస్ఆర్టీసీ అధికారులు నిర్ణయించారు.అంతేకాకుండా ఛార్జీలపై రాయితీలను సైతం అమలు చేయనున్నారు.

# చంద్రబాబుకు అంతుపట్టని ఆ ఎమ్మెల్యే! ఓవైపు వార్నింగ్ లు, మరోవైపు క్షమాపణలు..!



అమరావతి : ఏపీలో కూటమి సర్కార్ తాజాగా వంద రోజుల పాలన పూర్తి చేసుకుంది. దీనిపై క్షేత్రస్ధాయి నుంచి ఫీడ్ బ్యాక్ కూడా తెప్పించుకుంది. ఇందులో పలువురు ఎమ్మెల్యేల తీరుపై జనంలో అసంతృప్తి వ్యక్తమవుతున్నట్లు తేలింది కూడా.వీరిపై ఇప్పటికే చంద్రబాబు దృష్టిసారించారు. పార్టీకి, ప్రభుత్వానికీ చెడ్డపేరు తీసుకురావొద్దని హెచ్చరికలు కూడా జారీ చేశారు. అయినా వీరిలో కొందరు మాత్రం ఇప్పటికీ తీరు మార్చుకోవడం లేదు. దీంతో వీరిని ఏం చేయాలనే అంశంపై ఆయన మల్లగుల్లాలు పడుతున్నారు.ఇందులో మొదటి పేరు తిరువూరు సీటు నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన కొలికపూడి శ్రీనివాసరావుదే. దళిత సామాజిక వర్గానికి చెందిన కొలికపూడికి అమరావతి ఉద్యమంలో గట్టిగా పనిచేసారన్న పేరు రావడంతో తిరువూరు సీటు ఇచ్చి గౌరవించారు. కానీ ఆయన ఎన్నికల సమయంలోనే తన వివాదాస్పద వైఖరితో చర్చల్లో నిలిచారు. అప్పట్లో పార్టీ సీనియర్ నేతలు కొందరు ఆయనతో మాట్లాడి వివాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. అయినా ఆయన తీరులో ఎలాంటి మార్పూ లేదు.ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత కొలికపూడి వ్యవహారశైలి మరింత వివాదాస్పదంగా మారింది. రాజకీయ ప్రత్యర్ధులతో పాటు పార్టీలో ప్రత్యర్ధుల్ని, జర్నలిస్టుల్ని కూడా బహిరంగంగానే దూషించడం, మహిళలపై వేధింపుల ఆరోపణలు, రైతులపై వివాదాస్పద వ్యాఖ్యలు.. ఇలా ఒకటీ రెండూ కాదు. కొలికపూడి అంటేనే వివాదాస్పద ఎమ్మెల్యే అన్నట్లుగా ఆయన మారిపోయారు. తాజాగా తిరువూరులో భారీ ర్యాలీ చేపట్టేందుకు సిద్దమైన ఆయన.. అధినేత చంద్రబాబు నుంచి వచ్చిన ఫోన్ కాల్ తో దాన్ని చివరి నిమిషంలో విరమించుకున్నారు. ఆ తర్వాత జర్నలిస్టులపై చేసిన వ్యాఖ్యలపై బహిరంగసభలో క్షమాపణ చెప్పారు. తన వ్యాఖ్యలతో ఆత్మహత్యాయత్నం చేసిన సర్పంచ్ కుటుంబానికి కూడా సారీ చెప్పినట్లు తెలుస్తోంది.అనంతరం తనపై మరిన్ని ఆరోపణలు రావడంతో వీటిపై వివరణ ఇస్తానంటూ నిజం గెలవాలి పేరుతో ఇంట్లో దీక్ష ప్రారంభించారు. దీన్ని విరమింపజేసేందుకు అధిష్టానం కష్టపడాల్సి వచ్చింది. పార్టీ ప్రధాన కార్యదర్శి వర్ల రామయ్యతో ఫోన్ చేయించి సస్పెన్షన్ చేస్తామని హెచ్చరికలు చేయడంతో దీక్షను కొలికపూడి విరమించుకున్నారు. ఇలా ప్రతీ రోజూ ఏదో ఒక వివాదంతో సావాసం చేస్తున్న కొలికపూడి కారణంగా ఎన్టీఆర్ జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అధికార టీడీపీతో పాటు కూటమి సర్కార్ కూ చెడ్డపేరు వస్తుందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అయినా ఆయన మాత్రం వెనక్కి తగ్గడం లేదు.

# బాలీవుడ్ నటి కాదాంబరీ జెత్వానీ కేసులో ట్విస్ట్, పరుగో పరుగు



అమరావతి : బాలీవుడ్ నటి కదాంబరీ జెత్వానీ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని హైకోర్టు న్యాయవాది ఇనకొల్లు వెంకటేశ్వర్లు ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు.బాలీవుడ్ నటి కాదంబరీ జెత్వానీ కేసులో తనను అరెస్టు చేస్తారనే భయంతో లాయర్ వెంకటేశ్వర్లు ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. బాలీవుడ్ నటి కేసులో హైకోర్టు లాయర్ ఆయన బెయిల్ కోసం ప్రయత్నాలు చెయ్యడం హాట్ టాపిక్ అయ్యింది.నటి కాదాంబరీ జెత్వానీ కేసులో వైసీపీ నాయకుల వ్యవహారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టుకు చేరింది. ముబాయి నటి కాదంబరీ జెత్వానీ ఫిర్యాదు చేయడంతో ముగ్గురు ఐపీఎస్ అధికారులను ఇప్పటికే చంద్రబాబు నాయుడు ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ కేసులో తమకు బెయిల్ మంజూరు చేయాలని ఐపీఎస్ అధికారులు హైకోర్టును ఆశ్రయించారు. బాలీవుడ్ నటి కాదంబరీ జెత్వానీని వేధింపులకు గురి చేశారని నమోదు అయిన కేసులో ఐపీఎస్ అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, విశాల్ గన్నీ, క్రాంతి రాణాలను సస్పెండ్ చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేశారు.వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్ ఒత్తిడితోనే పోలీసు అధికారులు తన మీద తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేశారని, తనతోపాటు తన తల్లిదండ్రులను అరెస్టు చేసి జైల్లో పెట్టారని, మమ్మల్ని చిత్రహింసలకు గురి చేశారని బాలీవుడ్ నటి కాదంబరీ జెత్వానీ పోలీసు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసులో ఇప్పటికే వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్ ను పోలీసులు అరెస్ట్ చేశారు. వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్ తదితరులు అని పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.ఈ కేసులో కుక్కల విద్యాసాగర్ తదితరులు అని ఉండటటంతో అందులో తన పేరు ఉంటుందని ఆందోళన చెందుతున్న హైకోర్టు న్యాయవాది వెంకటేశ్వర్లు ముందస్తు బెయిల్ కోసం ఆంధ్రప్రదేశ్ హైకోర్టును ఆశ్రయించారు. బాలీవుడ్ నటి కాదాంబరీ జెత్వానీ కేసులో అక్టోబర్ ఒకటో తేదీ వరకు పోలీసు అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైకోర్టు ఇచ్చిన సమయం ఈరోజుతో ముగుస్తుండటంతో మరోసారి విచారణ జరగనుంది.హైకోర్టులో బెయిల్ తీసుకోవాలని ఐపీఎస్ అధికారులు, కొందరు వైసీపీ నాయకులు, న్యాయవాది వెంకటేశ్వర్లు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ కేసులో ఇంకా పలువురు పేర్లు చేరే అవకాశం ఉందని సమాచారం. తనతో పాటు తన తల్లిదండ్రులను చిత్రహింసలకు గురి చేసిన పోలీసు అధికారుల మీద చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ముంబాయి నటి కాదాంబరీ జెత్వానీ పోలీసు అధికారులకు మనవి చేసింది. అయితే ఈ కేసును సమర్థవంతమైన అధికారికి అప్పగించాలని కోరుతూ వైసీపీ నాయకుడు కుక్కల విద్యాసాగర్ హైకోర్టులో పిటిషన్ వేశారు.

# వైసీపీకి లడ్డూలా దొరికిన పవన్



అమరావతి : ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందిన తిరుమల శ్రీవారి లడ్డూ తయారీపై నెలకొన్న వివాదంలో దేశ అత్యున్నత న్యాయస్థానం జోక్యం చేసుకోవడంతో రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటు చేసుకుంటోన్నాయి.లడ్డూ తయారీ కోసం వినియోగించే నెయ్యి తయారీలో ఎలాంటి కల్తీ జరగలేదంటోన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకుల వాదనలు మరింత బలపడ్డాయి.కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవం తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామివారి లడ్డూ ప్రసాదం తయారీలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వు, చేపనూనెలను వాడారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేసిన ఆరోపణలకు సంబంధించిన ఎలాంటి సాక్ష్యాధారాలు లేవంటూ సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే.తిరుమల లడ్డూ తయారీలో నెయ్యికి బదులుగా జంతువుల కొవ్వును వినియోగించి గత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అపవిత్రం చేసిందంటూ చంద్రబాబు ఆరోపణలు గుప్పించిన విషయం తెలిసిందే. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేష్, వై సత్యకుమార్ సహా పలువురు జనసేన, భారతీయ జనతా పార్టీ నాయకులు దీనిపై ఓ ఉద్యమమే సృష్టించారు.పవన్ కల్యాణ్ ఏకంగా ప్రాయశ్చిత్త దీక్షకు దిగారు. వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పునకు తాను ప్రాయశ్చిత్తం చేసుకుంటానంటూ దీక్ష చేపట్టారు. ఇందులో భాగంగా విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి గుడి మెట్లను సైతం శుభ్రపరిచారాయన. ఇంకో రెండు రోజుల్లో ఈ దీక్ష ముగియాల్సి ఉంది.చంద్రబాబు చేసిన ఆరోపణల్లో వాస్తవాలేమిటనేది దేశ ప్రజలకు తెలియాలనే ఉద్దేశంతో బీజేపీ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి వేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. కల్తీ జరిగిందనడానికి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని తేల్చి చెప్పింది. చంద్రబాబును తప్పుపట్టింది. రాజకీయాలకు కనీసం దేవుళ్లనయినా దూరంగా పెట్టాలంటూ హితబోధ చేసింది.దీనిపై తిరుపతికి చెందిన వైఎస్ఆర్సీపీ ఎంపీ డాక్టర్ మద్దిళ్ల గురుమూర్తి స్పందించారు. ప్రాయశ్చిత్త దీక్షంలో ఉన్న పవన్ కల్యాణ్‌కు కొన్ని సూటి ప్రశ్నలు సంధించారు. పవిత్రమైన తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో వినియోగించే నెయ్యిలో ఎలాంటి కల్తీ జరగలేదంటూ సుప్రీంకోర్టు తేల్చి చెప్పిందని, రాజకీయాల్లోకి దేవుళ్లను లాగొద్దంటూ చంద్రబాబుకు సుప్రీంకోర్టు హితవు పలికిందని గుర్తు చేశారు.అలాంటప్పుడు ఈ ప్రాయశ్చిత్త దీక్ష అవసరమా? అంటూ గురుమూర్తి ప్రశ్నించారు. అసలు కల్తీనే జరగనప్పుడు దీక్ష గానీ, తిరుపతిలో బహిరంగ సభను గానీ నిర్వహించాల్సిన అవసరం లేదని అన్నారు. దీనివల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న కోట్లాదిమంది హిందువుల మనోభావాలను మరోసారి కించపరిచినట్టవుతుందని చెప్పారు.దేశ అత్యున్నత న్యాయస్థానంలో కేసు విచారణలో

# అన్నమయ్య జిల్లాకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ఉత్తమ అవార్డు



రాయల్ జర్నలిజం, రాయచోటి, అక్టోబర్ 01:స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో ఉత్తమ పనితీరుతో మంచి కార్యక్రమాలు నిర్వహించినందుకు గాను స్వచ్ఛతాహి సేవ - 2024 గ్రామీణ విభాగంలో, సఫాయి మిత్ర సురక్ష కాంపోనెంట్ లో అన్నమయ్య జిల్లా ఉత్తమ అవార్డు పొందిందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డును అన్నమయ్య జిల్లా తరఫున జిల్లా పంచాయతీ అధికారి ధనలక్ష్మి, అక్టోబర్ రెండవ తారీఖున మచిలీవట్నంలో జరగబోయే కార్యక్రమంలో గౌరవ ముఖ్యమంత్రివర్యులు చేతులమీదుగా జిల్లా కలెక్టర్ తరఫున అందుకుంటారని ఆయన తెలిపారు. ఉత్తమ సేవలు అందించిన జిల్లా సంయుక్త కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, సిపిఓ, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలు, ఈవోపీఆర్ అండ్ ఆర్ డి, పంచాయతీ సెక్రటరీలు, సఫాయి మిత్రాలు, ఆరోగ్యశాఖ సిబ్బందికి ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అభినందనలు తెలిపారు.

# వైభవంగా టిడిపి మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ జన్మదిన వేడుకలు



రామసముద్రం.అక్టోబర్ 1 రాయల్ జర్నలిజం. రామసముద్రం మండలం టిడిపి మండల అధ్యక్షుడు విజయ్ కుమార్ గౌడ్ మంగళవారం రాత్రి తన స్వగ్రామం గుంతల పేట గ్రామంలో తన నివాసం దగ్గర పెద్ద ఎత్తున భారీగా టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు బిజెపి జనసేన కార్యకర్తలు నాయకులు విజయ్ కుమార్ గౌడ్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.భారీ ఎత్తున బాణసంచా పేల్చే సంబరాలు చేసుకున్నారు. అనంతరం విజయ్ కుమార్ గౌడ్ ఆయన సతీమణి సర్పంచ్ కవితమ్మ చేతుల మీదగా కేక్ కట్ చేసి ప్రజలకు కార్యకర్తలకు పంచిపెట్టారు.ఎమ్మెల్యే షాజహాన్ భాష మండల అధ్యక్షుడు కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి పాఠశాలలకు దసరా సెలవులు : ఎంఈఓ హేమలత



రామసముద్రం. అక్టోబర్ 1 రాయల్ జర్నలిజం: రామ సముద్రం మండలం మండల విద్యాశాఖ అధికారిని హేమలత మంగళవారం మాట్లాడుతూ నేడు గాంధీ జయంతి కావడంతో సెలవు కావడంతో రేపటి నుంచి దసరా సెలవులు 13వ తేదీ వరకు సెలవుల కొనసాగుతాయని తిరిగి 14వ తేదీ పాఠశాలలు పున్న ప్రారంభమవుతాయని తెలిపారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు సెలవుల్లో విద్యార్థులకు తరగతుల నిర్వహించరాదని తెలిపారు. విద్యార్థులు నీటి కుంటల దగ్గరకు ప్రమాదాలు జరిగే చోట్లకు వెళ్లకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధలు తీసుకోవాలని తెలిపారు.

# ఘనంగా జడ్పీటీసి రామచంద్ర రెడ్డి జన్మదిన వేడుకలు



రామసముద్రం.అక్టోబర్ 1 రాయల్ జర్నలిజం. రామసముద్రం మండలంలోని వైఎస్ఆర్సిపి పార్టీ ప్రస్తుత జడ్పిటిసిహెచ్ రామచంద్ర రెడ్డి జన్మదిన వేడుకల సందర్భంగా ఆయనకు మంగళవారం ఆ పార్టీ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆర్ నడింపల్లి లో ఆయన అభిమానులు కార్యకర్తలు కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. వారు మాట్లాడుతూమా నాయకుడు రామచంద్ర రెడ్డి ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో ఉండాలని మరిన్ని పదవులను అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోఆయన అభిమానులునాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

# లోకేష్‌కు కీలక బాధ్యతలు.. చంద్రబాబు సంచలన నిర్ణయం!



అమరావతి : నారా లోకేష్ పై కీలక బాధ్యతలు పెట్టారు చంద్రబాబు. పార్టీలో ఇప్పుడు లోకేష్ ప్రాధాన్యత పెరిగింది. అటు ప్రభుత్వంలో కూడా మంత్రిగా ఉన్నారు.అయితే కూటమి ప్రభుత్వం ఉన్నవేళ లోకేష్ సైతం చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. తనపై ప్రత్యర్థులు దుష్ప్రచారం చేసే అవకాశం ఉన్నందున వీలైనంతవరకు.. కూటమి పార్టీలతో సర్దుబాటు చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఒకవైపు పవన్ కళ్యాణ్ తో పాటు జనసైనికులు సైతం సమన్వయం చేసుకుంటున్నారు. మొన్న ఆ మధ్యన ఢిల్లీ వెళ్లి పెద్దలను కూడా కలిశారు. అయితే ఇదంతా పక్క వ్యూహంతో జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా నామినేటెడ్ పదవుల విషయంపై చర్చించడానికి లోకేష్ ఢిల్లీ వెళ్ళినట్లు సమాచారం. క్షేత్రస్థాయిలో పదవుల పంపకం విషయంలో కొన్ని రకాల ఇబ్బందులు ఉన్నాయి. వాటిని చర్చించేందుకే లోకేష్ ఢిల్లీ వెళ్లినట్లు తెలుస్తోంది. చంద్రబాబు నామినేటెడ్ పదవుల విషయంలో లోకేష్ కు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన ఇటు రాష్ట్రంలో జనసేనతో, అటు జాతీయస్థాయిలో ఢిల్లీ పెద్దలతో చర్చలు జరుపుతున్నారు.

**సుదీర్ఘ పాదయాత్ర :** టిడిపి విపక్షంలో ఉన్నప్పుడు లోకేష్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర చేశారు. అప్పట్లో వైసీపీ దూకుడు మీద ఉండేది. టిడిపి శ్రేణులు పై దాడులు కేసులు కొనసాగేవి. పార్టీ నాయకులు చాలా ఇబ్బందులు పడేవారు. ఆ విషయాన్ని స్వయంగా తెలుసుకున్నారు లోకేష్. పాదయాత్రకు సైతం అప్పటి వైసిపి ప్రభుత్వం అడ్డంకులు సృష్టించింది. ఆ సమయంలో చాలామంది టీడీపీ నేతలు దూకుడుగా వ్యవహరించారు. కేసులను ఎదుర్కొన్నారు. అయితే దారి పొడవునా టిడిపి నేతల పోరాటాలను, వారిపై ఉన్న కేసులను తెలుసుకున్నారు లోకేష్.

**ఆశావహులు అధికం :** ఇటీవల చంద్రబాబు నామినేటెడ్ పదవులను ప్రకటించారు. 20 కార్పొరేషన్లకు సంబంధించి అధ్యక్షులను నియమించారు. జనసేన తో పాటు బిజెపికి కూడా ప్రాధాన్యం ఇచ్చారు. అయితే పార్టీలో ఇంకా ఆశావాహులు అధికంగా ఉన్నారు. దీంతో చంద్రబాబుకు విజ్ఞప్తులు వెల్లువెత్తుతున్నాయి. చంద్రబాబు ఎక్కడికి వెళుతున్నా నేతలు వినతులు ఇస్తున్నారు. దీంతో ఒక రకమైన ఇబ్బందిని ఎదుర్కొంటున్నారు చంద్రబాబు. ఇప్పటికే పాలనతో పాటు పార్టీ వ్యవహారాలను చూసుకుంటున్నారు. కూటమితో సమన్వయం చేసుకుంటున్నారు. అందుకే ఇప్పుడు నామినేటెడ్ పదవుల వ్యవహారాన్ని లోకేష్ కు అప్పగించినట్లు తెలుస్తోంది.

**పార్టీలో పెరిగిన పట్టు :** టిడిపిలో లోకేష్ కు పట్టు పెరిగింది. సీనియర్లతో సైతం ఆయన చనువుగా ఉంటున్నారు. జిల్లాలో పార్టీ పరిస్థితి గురించి ఎప్పటికప్పుడు ఫీడ్ బ్యాక్ తెచ్చుకుంటున్నారు. అదే సమయంలో జనసేనతో పాటు బిజెపితో కూడాసమన్వయంతో కొనసాగుతున్నారు. పొత్తు అనేది సుదీర్ఘకాలం కొనసాగాలని భావిస్తున్న నేపథ్యంలో లోకేష్ సైతం చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. సొంత పార్టీకి న్యాయం చేయడంతో పాటు మిత్రపక్షాలుగా ఉన్న బిజెపి, జనసేనతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంప్రదింపులు కొనసాగిస్తున్నారు. వీలైనంత త్వరగా ఎటువంటి అరమరికలు లేకుండా నామినేటెడ్ పదవుల పందారం పూర్తి చేయాలన్న ఆలోచనతో లోకేష్ ఉన్నారు.

# మంత్రి లోకేశ్ కీలక ఆదేశాలు.. విద్యార్థులకు భారీ గుడ్ న్యూస్!



అమరావతి : విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విద్యాశాఖ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు మంత్రి నారా లోకేశ్ హెడ్ మాస్టర్స్, సెకండరీ గ్రేడ్ టీచర్లకు సమగ్ర శిక్షణ అందించాలంటూ ఆదేశించారు.ఆయన సంబంధిత అధికారులతో మంగళగిరిలోని తన నివాసంలో సమీక్ష నిర్వహించారు. అక్టోబర్ నెలాఖరుకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలకు (ఎస్ఎంసీ) శిక్షణను పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో సౌకర్యాలు, ఫలితాల మెరుగుపరిచేందుకు ఎస్ఎంసీ సభ్యుల వద్ద మరింత అర్థవంతమైన భాగస్వామ్యం ఉండాలని కోరారు.స్కూళ్ల నిర్వహణపై ఫీడ్‌బ్యాక్ కోసం రూపొందించిన యాప్‌లలో ఎస్ఎంసీ సభ్యులు చేయాల్సిన పనులను ప్రధానోపాధ్యాయులు చేయవద్దని మంత్రి స్పష్టం చేశారు. ఎస్ఎంసీ సభ్యుల అభిప్రాయ సేకరణకు ప్రత్యేక యాప్‌ను రూపొందించాలని అధికారులకు సూచించారు. ప్రతి పాఠశాలకు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను త్వరగా అందించాలన్నారు. విద్యాకానుకకు సంబంధించి బాలులు, బాలికలకు సమాన ప్యాట్రన్ ఉండేలా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థులకు అందించబోతున్న పాఠ్యపుస్తకాలలో రాజకీయ రంగులు లేదా కంటెంట్ ఉండకూడదని స్పష్టం చేశారు.ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల కోసం పెద్ద మొత్తం ఖర్చు చేస్తున్నా, హాజరు శాతం కేవలం 70% మాత్రమే ఉన్నందుకు గల కారణాలను పరిశీలించి, పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యార్థులకు అందిస్తున్న బ్యాగులు, షూస్, డిక్షనరీల నాణ్యతపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశానికి పాఠశాల విద్య కార్యదర్శి కోన శశిధర్, డైరెక్టర్ విజయరామరాజు, ఇంటర్మీడియట్ విద్య డైరెక్టర్ కృతికా శుక్లా, సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి. శ్రీనివాసరావు ఇతరులు పాల్గొన్నారు.

# నంద్యాలలో పట్టాలు తప్పిన రైలు..



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో మరో రైలు ప్రమాదం చోటు చేసుకుంది.. నంద్యాల రైల్వే స్టేషన్ సమీపంలో పట్టాలు తప్పింది పెట్రోల్ ట్యాంకర్ గూడ్స్ రైలు. 5వ లైన్‌పై రైలు నిలిచిపోయింది.. దీంతో.. పట్టాల పైనుంచి పక్కకు ఒరిగాయి చివరి 5 బోగీలు.. అయితే, రైళ్ల రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.. 1, 2 లైన్లపై యథావిధిగా రైళ్ల రాకపోకలు కొనసాగిస్తున్నారు.. మరోవైపు.. రైలు పట్టాలు తప్పడంపై విచారణ చేపట్టారు రైల్వే అధికారులు.. అయితే, సాంకేతిక లోపం కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టు రైల్వే సిబ్బంది చెబుతున్నారు.. ఇక, పూర్తిస్థాయిలో రైళ్ల రాకపోకల పునరుద్ధరణకు ముమ్మరంగా చర్యలు చేపట్టారు రైల్వే సిబ్బంది..కర్ణాటక లోని బెటిపిన్ నుండి కాకినాడకు వెళ్తున్న ఖాళీ డీజిల్ ట్యాంక్ రైలు.. నంద్యాల రైల్వే స్టేషన్ వద్ద పట్టాలు తప్పింది. డీజిల్ ఫిల్లింగ్ చేసుకోవడానికి కాకినాడ సమీపం లోని గంగినేని ఫిల్లింగ్ స్టేషన్ వద్దకు ఖాళీ ట్యాంకర్లతో బయలుదేరింది. రైలు స్టేషన్ చేరుకోగానే కేవలం 10 కిలోమీటర్ల వేగం ఉన్నప్పుడు చివరి 3 బోగీలు పట్టాలు తప్పాయి%‰% అయితే, 5 వ లైన్ లో జరగడంతో రైళ్ల రాకపోకలకు ఇబ్బంది రాలేదు. మరో రైలును తెప్పించి పట్టాలపైకి ఎక్కించారు. యుద్ధ ప్రాతిపదికపై లైన్ పునరుద్దన పనులు చేపట్టారు..

# ముకేష్ అంబానీ ఒకరోజు సంపాదన ఎంతో తెలిస్తే మీరు షాక్ అవుతారు



అమరావతి : రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ , ఎండీ అయిన ముకేష్ అంబానీ భారతదేశంలో మాత్రమే కాదు, ఆసియాలోనే అత్యంత ధనవంతుడు.ముకేష్ అంబానీ నెట్వర్త్ (సంపద విలువ) సుమారు 116 బిలియన్ డాలర్లు ఉంటుందని అంచనా వేశారు. బ్లూమ్బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, రిలయన్స్ ఛైర్మన్ ప్రపంచంలో 12వ అత్యంత సంపన్న వ్యక్తి. అతని తర్వాత, అదానీ గ్రూప్ ఓనర్ గౌతమ్ అదానీ 13వ ర్యాంక్లో ఉన్నారు. బ్లూమ్బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ ప్రకారం, అంబానీ నికర విలువ 104 బిలియన్ డాలర్లు.భారతదేశంలో అత్యంత ధనవంతుడు ముకేష్ అంబానీ గంటకు ఎంత సంపాదిస్తున్నారో మీరు ఎప్పుడైనా ఆలోచించారా?. ఆయన రోజు సంపాదన ఎంతో మీకు తెలుసా?

**ముకేష్ అంబానీ రోజు సంపాదన ఇది**

ముకేష్ అంబానీ సంపదను అంచనా వేయడానికి ఒక లెక్క ఉంది. ఒక వ్యక్తి, ప్రతి సంవత్సరం రూ. 4 లక్షలు సంపాదిస్తే, రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ప్రస్తుత సంపద స్థాయికి చేరుకోవడానికి అతనికి 1.74 కోట్ల సంవత్సరాలు పడుతుంది. ఇది ఆశ్చర్యం కలిస్తున్నా, ఇదే నిజం.గతంలో, ముకేష్ అంబానీ ప్రతి సంవత్సరం దాదాపు 15 కోట్ల రూపాయల జీతం తీసుకునేవారు. కానీ, కరోనా నుంచి జీతం తీసుకోకుండానే పని చేస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం, ఆయన రోజుకు సగటున రూ.163 కోట్లు సంపాదిస్తున్నారు. గంటకు దాదాపు 6.80 కోట్లు ఆర్జిస్తున్నారు. అంటే, అంబానీ తన ఇంట్లో ప్రశాంతంగా నిద్ర పోతున్నప్పటికీ, ప్రతి గంటకూ ఆయన సంపద విలువ 6.80 కోట్లు పెరుగుతుంది. కరోనా కాలం నుంచి జీతం లేకపోతే అంబానీకి ఇంత డబ్బు ఎలా వస్తుంది?. ఈ డబ్బు అతనికి రిలయన్స్ ఇండస్ట్రీస్లో వాటాల నుంచి వస్తుంది. పెట్రో కెమికల్, ఆయిల్, టెలికాం, రిటైల్ వంటి చాలా రంగాల్లోకి రిలయన్స్ ఇండస్ట్రీస్ విస్తరించింది, పదుల సంఖ్యలో వ్యాపారాలు ఉన్నాయి. ఇది కాకుండా, ముంబైలోని సొంత ఇల్లు యాంటిలియాతో సహా రియల్ ఎస్టేట్లో ముకేష్ అంబానీ చాలా పెట్టుబడులు పెట్టారు. యాంటిలియా విలువ దాదాపు రూ.15,000 కోట్లు ఉంటుందని అంచనా.

**2020 నాటికి ప్రతి గంటకు రూ.90 కోట్ల సంపాదన**

2020 నాటికి ముకేష్ అంబానీ ప్రతి గంటకు సగటున రూ.90 కోట్లు సంపాదించేవారట. అంటే, రోజుకు 2,160 కోట్ల ఆదాయం. మరోవైపు, భారతదేశంలో దాదాపు 24 శాతం మంది ప్రజలు నెలకు కేవలం 3000 రూపాయలు మాత్రమే సంపాదించగలుగుతున్నారు.అంబానీ కుటుంబ కార్యక్రమాలు కూడా వారి హోదాకు తగ్గట్టుగానే ఉంటాయి. ఈ ఏడాది, తన చిన్న కొడుకు అనంత్ అంబానీ పెళ్లి కోసం దాదాపు రూ.5000 కోట్లు వెచ్చించి యావత్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచారు ముకేష్ అంబానీ.

# వాంగ్‌చుక్ నిర్బంధం ఆమోదయోగ్యం కాదు: మండిపడిన రాహుల్



న్యూఢిల్లీ : పర్యావరణ కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్, ఆయన మద్దతుదారులను సింగు సరిహద్దుల్లో ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈనేపథ్యంలో ఆయన్ను నిర్బంధించడం ఆమోదయోగ్యం కాదని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్ట్ చేశారు.'పర్యావరణ, రాజ్యాంగ హక్కుల కోసం శాంతియుతంగా పోరాడుతున్న సోనమ్ వాంగ్‌చుక్‌తో పాటు వందల మంది లద్దాఖీలను నిర్బంధించడం ఆమోదయోగ్యం కాదు. లద్దాఖ్ భవిష్యత్తు కోసం పోరాడుతున్న వృద్ధ పౌరులను ఢిల్లీ సరిహద్దుల్లో ఎందుకు నిర్బంధించారు? మోదీ రైతులపై పన్నిన చక్రవ్యూహం మాదిరిగానే ఇది విచ్ఛిన్నమవుతుంది. లద్దాఖ్ వాణిని మీరు వినవలసి ఉంది' అని ఆయన పేర్కొన్నారు.ఇక, సోనమ్ వాంగత్‌చుక్, ఆయన మద్దతుదారులను సోమవారం అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు సైతం స్పష్టంచేశారు. అదేవిధంగా ఆ ప్రాంతంలో సెక్షన్ 163 విధించినట్లు ప్రకటించారు.ఇదిలాఉండగా.. పోలీసులు తనను నిర్బందించారని సోమన్ వాంగ్‌చుక్ ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'నన్ను, 150 మంది పాదయాత్రదారులను వెయ్యి మంది పోలీసు బలగాలు కలిసి నిర్బంధించారు. మాలో చాలా మంది వృద్ధులు, ఆర్మీ నుంచి రిటైర్డ్ అయిన వ్యక్తులు ఉన్నారు. మా భవిష్యత్తు ఏంటో తెలియదు. మేము బాపు సమాధి వద్ద శాంతియుతంగా పాదయాత్ర చేస్తున్నాం. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో.. ప్రజాస్వామ్య మాత.. హే రామ్!' అని ఆయన పోస్ట్‌లో పేర్కొన్నారు.సోనమ్ వాంగ్‌చుక్, ఇతర మద్దతుదారులు తమ డిమాండ్‌లను నెరవేర్చాలని గత నెల 1న లేహ్‌లో పాదయాత్ర ప్రారంభించారు. హిమాచల్ ప్రదేశ్‌కు వారి పాదయాత్ర చేరుకున్నాక వాంగ్‌చుక్ తమ పాదయాత్ర ఉద్దేశాన్ని వెల్లడించారు. ఐదేళ్ల క్రితం కేంద్రం తమకిచ్చిన వాగ్దానాన్ని గుర్తుచేసేందుకు ఈ పాదయాత్ర చేపట్టామన్నారు. ఇక, వారి డిమాండ్‌లలో ప్రధానమైనది లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేర్చడం. ఇది స్థానిక జనాభా, వారి భూమి, సాంస్కృతిక గుర్తింపును రక్షించేందుకు చట్టాన్ని రూపొందించే అధికారాన్ని ఇస్తుంది. ఇదిలాఉండగా.. 2019 ఆగస్టులో ఆర్టికల్ 370 రద్దుతో జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా కేంద్రం విభజించింది. అందులో లద్దాఖ్ కూడా ఒకటి.

# మా సీక్రెట్ సర్వీస్ అధిపతే ఇజ్రాయెల్ గూఢచారిగా మారిపోయాడు: ఇరాన్ మాజీ అధ్యక్షుడు

న్యూఢిల్లీ : ఇజ్రాయెల్‌పై నిఘా కోసం ఏర్పాటుచేసిన ఓ ఇంటెలిజెన్స్ అధిపతే చివరికి తమను మోసం చేశాడని ఇరాన్ మాజీ అధ్యక్షుడు మహమూద్ అహ్మదినెజాద్ వాపోయారు.అతడు తమ సమాచారం ఇజ్రాయెల్‌కు చేరవేసేవాడని ఆరోపించారు. టెహ్రాన్‌లో మొస్సాద్ సంస్థ ఏ స్థాయిలో వేళ్లూనుకుందో వెల్లడిస్తూ ఈవిషయాన్ని సీఎన్ఎన్ తుర్క్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈసందర్భంగా పలు ఆసక్తికర వాస్తవాలను అయన వెల్లడించారు.మొస్సాద్ విజయవంతంగా మా ఇంటెలిజెన్స్ యూనిట్స్‌ను తన వైపునకు తిప్పుకొందన్నారు. వీరిలో సీనియర్ అధికారులు కూడా ఉన్నట్లు చెప్పారు. దాదాపు 20 మంది ఇంటెలిజెన్స్ సిబ్బంది డబుల్ ఏజెంట్లుగా మారిపోయి ఇజ్రాయెల్‌కు అత్యంత కీలకమైన అణు రహస్యాలను చేరవేశారన్నారు. ఈ వ్యాఖ్యలతో ఇరాన్ భద్రత, నిఘా వ్యవస్థలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. మా నిఘా సంస్థకు చెందిన ఓ అధిపతే ఇజ్రాయెల్ గూఢచారని 2021లో బయటపడిందన్నారు. ఇరాన్‌లో టెల్అవీవ్ అత్యంత కఠిన ఆపరేషన్లు నిర్వహించి తేలిగ్గా కీలక సమాచారం చేజిక్కించుకొంటుందని చెప్పారు. ఇటీవల కాలంలో మొస్సాద్ కార్యకలాపాలు మరింత పెరిగిపోయాయని చెప్పారు.




**1,00,000 అణు రహస్యపత్రాల అపహరణ..**

మొస్సాద్ ఓ ఆపరేషన్ చేసి దాదాపు 1,00,000 అణుపత్రాలను అపహరించింది. వాటిని ఇజ్రాయెల్ ప్రధాని 2018లో బహిర్గతం చేశారు. ఇరాన్ ఏవిధంగా సీక్రెట్‌గా అణు కార్యక్రమాలు నిర్వహిస్తోందో.. వాటిలో స్పష్టంగా ఉన్నాయి. టెహ్రాన్‌లోని రహస్య స్థావరంలోకి మొస్సాద్ ఏజెంట్లు చొరబడి వీటిని దక్కించుకొన్నారు. దాదాపు పాతిక మంది ఇందులో పాల్గొన్నట్లు సమాచారం. ఇరాన్ అణు లక్ష్యాలను ఇది తీవ్రంగా దెబ్బతీసింది.

# రాజకీయ కుట్రలకు ఆమె బాధితురాలు: భార్య సంచలన పోస్ట్‌పై సిద్ధరామయ్య



న్యూఢిల్లీ : 'ముడా ' కుంభకోణం వ్యవహారం కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ను ముప్పతిప్పలు పెడుతున్న వేళ.. ఆయన సతీమణి పార్వతి సంచలన నిర్ణయం తీసుకున్నారు.తమ భూములను తిరిగి ముడా సంస్థకు ఇచ్చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నిర్ణయంపై ముఖ్యమంత్రి స్పందించారు. రాజకీయ విద్వేషాలు, కుట్రలకు తన భార్య బాధితురాలయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏదేమైనా ఆమె నిర్ణయాన్ని గౌరవిస్తున్నట్లు తెలిపారు."ముడా స్థలాల కేటాయింపులో భాగంగా మాకు వచ్చిన భూములను నా భార్య పార్వతి తిరిగిచ్చేసింది. దీనిపై ప్రతిపక్షాలు తప్పుడు ఫిర్యాదులు సృష్టించి నా కుటుంబాన్ని వివాదంలోకి లాగారు. ఈ విషయం రాష్ట్ర ప్రజలకు కూడా తెలుసు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడాలన్నదే నా సిద్ధాంతం. కానీ, నాపై జరుగుతున్న ఈ రాజకీయ కుట్రలు చూసి నా భార్య ఆవేదన చెందింది. అందుకే భూములను తిరిగి ఇవ్వాలని నిర్ణయించుకుంది. ఇది నాకు ఆశ్చర్యం కలిగించినప్పటికీ ఆమె నిర్ణయాన్ని నేను గౌరవిస్తున్నా. నాలుగు దశాబ్దాల నా రాజకీయాల్లో ఎలాంటి జోక్యం చేసుకోకుండా.. కుటుంబ బాధ్యతలకే పరిమితమైన నా భార్య.. ఇప్పుడు ఇలాంటి విద్వేష రాజకీయాలకు గురై మానసిక క్షోభను అనుభవిస్తోంది" అని సిద్ధరామయ్య సుదీర్ఘ పోస్ట్ చేశారు.ముడా వివాదాని కి సంబంధించి సిద్ధరామయ్యపై ఈడీ కేసు నమోదు చేసిన వేళ.. ఆయన భార్య సోమవారం ఓ లేఖ విడుదల చేశారు. అవినీతి మరకలేని తన భర్త రాజకీయ జీవితానికి ముప్పు తెస్తున్న 'ముడా'కు చెందిన 14 ప్లాట్లు తిరిగి అదే సంస్థకు ఇచ్చేస్తున్నట్లు ఆమె ప్రకటించారు. "మా అన్నయ్య పసుపు కుంకుమల కింద ఇచ్చిన ఈ ప్లాట్లు ఇంత రాద్ధాంతం చేస్తాయని ఊహించలేదు. నా భర్త గౌరవం, ఘనతకు మించి ఈ ఆస్తులు పెద్దవి కావు. ఇన్నేళ్లు ఆయన అధికారం నుంచి ఏమీ ఆశించని మాకు ఈ ఆస్తులు తృణప్రాయం. అందుకే ఈ స్థలాలను తిరిగి ముడాకు అప్పగిస్తున్నా. ఈ విషయంలో నా భర్త అభిప్రాయం ఏమిటో తెలియదు. నా కుటుంబసభ్యులతోనూ చర్చించకుండా నాకు నేనుగా తీసుకున్న నిర్ణయమిది. ఈ ఆరోపణలు వినిపించిన రోజే ఈ నిర్ణయం తీసుకోవాలనుకున్నా. నా భర్త రాజకీయ కుట్రలో మరింత నష్టపోతున్నాడని తెలిసి ఈ నిర్ణయం తీసుకున్నా. అవసరమైతే దర్యాప్తునకు సహకరిస్తా. రాజకీయ రంగానికి దూరంగా ఉండే నాలాంటి ఆడవాళ్లను వివాదాల్లోకి లాగొద్దు' అని ఆమె ఆ లేఖలో పేర్కొన్నారు.మరోవైపు, ఈ పరిణామాలపై ముడా కమిషనర్ స్పందించారు. 'ముడా ఆస్తులను ఎవరైనా వెనక్కి ఇచ్చేస్తే మేం తీసుకుంటాం. దీనిపై మేం చర్చలు జరుపుతున్నాం" అని వెల్లడించారు.

# లెబనాన్ బార్డర్‌లో 600 మంది భారత సైనికులు.. వాట్స్ నెక్స్ట్ ?

న్యూఢిల్లీ : లెబనాన్‌పై ఇజ్రాయెల్ భీకర దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో ఇప్పటికే వందలాది మంది సామాన్య లెబనాన్ ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. మరోవైపు లెబనాన్ భూభాగంలోకి ఇజ్రాయెల్ ఆర్మీ ప్రవేశించి గ్రౌండ్ ఆపరేషన్ మొదలుపెట్టింది.దీంతో ఈ యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగొచ్చని, మరణాల సంఖ్య మరింత పెరగొచ్చనే అంచనాలు వెలువడుతున్నాయి. ఈ తరుణంలో ఐక్యరాజ్యసమితి శాంతి పరిరక్షణ దళం తరఫున ఇజ్రాయెల్–లెబనాన్ సరిహద్దుల్లో 600 మంది భారతీయ సైనికులను మోహరించారు. ఈ దేశాల బార్డర్‌లో 120 కి.మీ.ల బ్లూలైన్ ఉంది. దాని వెంట 600 మంది భారతీయ సైనికులు గస్తీ విధులు నిర్వర్తిస్తున్నారు.ఇజ్రాయెల్ – లెబనాన్ యుద్ధం తీవ్రరూపు దాలుస్తున్న ప్రస్తుత తరుణంలో యూఎన్ పీస్ కీపింగ్ ఫోర్స్‌లోని తమ సైనికుల భద్రతపై భారత్ ప్రత్యేక ఫోకస్ పెట్టింది. ఈవిషయాన్ని సెంటర్ ఫర్ జాయింట్ వార్‌ఫేర్ స్టడీస్ మాజీ డైరెక్టర్ జనరల్ మేనేజర్ అశోక్‌కుమార్ తెలిపారు. అయితే భారత్ అక్కడి నుంచి తమ సైనికులను హుటాహుటిన వెనక్కి పిలుచుకోలేదు. దీనికి సంబంధించిన తుది నిర్ణయాన్ని ఐక్యరాజ్యసమితి పీస్ కీపింగ్ ఫోర్స్ తీసుకోవాల్సి ఉంటుంది. ఇజ్రాయెల్‌తో భారత్‌కు బలమైన సంబంధాలు ఉన్నాయి. అందుకే లెబనాన్ ప్రాంతంలో భారత సైనికుల మోహరింపు అనేది క్లిష్టమైన అంశంగా మారింది.



ఇరాన్‌తోనూ భారత్‌కు చాలా మంది సంబంధాలు ఉన్నాయి. లెబనాన్‌లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న హిజ్బుల్లా మిలిటెంట్ సంస్థకు ఇరాన్ అన్ని రకాల సాయం చేస్తోంది. అందుకే హిజ్బుల్లాపై పోరాడినా ఇరాన్‌తో భారత్ సంబంధాలు దెబ్బతినే అవకాశం ఉంటుంది. ఇరాన్‌లోని చాబహార్ పోర్టు ప్రాజెక్టు అనేది భారత్‌కు ఎంతో విలువైనది. అది దెబ్బతినకూడదంటే ఇరాన్‌తో మంచి సంబంధాలను కొనసాగించాలి.వీటన్నింటికి మించి గల్ఫ్ ప్రాంతంలోని వివిధ దేశాల్లో దాదాపు 90 లక్షల మంది భారతీయులు ఉన్నారు. వారి రక్షణ కూడా మన దేశానికి కీలకం. గల్ఫ్ దేశాల నుంచి భారత్‌కు నిత్యం

# On Bulldozer Action, Supreme Court Says Public Safety Is Paramount



The Supreme Court on Tuesday said that public safety is paramount and any religious structure encroaching upon a road, water bodies, or rail tracks must go.The court further stressed that India is a secular country and its directions for bulldozer action and anti-encroachment drives will be for all citizens, irrespective of the religion they follow."Whether it be temple or dargah, it has to go. Public safety is paramount," the top court bench headed by Justice BR Gavai and Justice KV Viswanathan was hearing petitions challenging bulldozer action against people accused of crimes. While the state authorities using bulldozer action on the accused have maintained that only illegal constructions are being demolished in such cases.Solicitor General Tushar Mehta represented three states in the matter - Uttar Pradesh, Gujarat and Madhya Pradesh."We are a secular country and our directions will be for all, irrespective of religion or community. Of course, for encroachment we have said… if it is on a public road, footpath, water body or railway line area, it has to go, public safety is paramount. If there is any religious structure in the middle of the road, be it gurudwara or dargah or temple, it cannot obstruct public," the court said.The apex court during the hearing questioned Mehta if being accused in a criminal case can be a ground for facing bulldozer action, the Solicitor General said, "Absolutely not, even for heinous crimes like rape or terrorism. Like my lord said it cannot also be that the notice issued is stuck one day before, it has to be in advance. "Earlier on September 17, the top court bench had said there will be no demolition of properties, including of those accused of crime, till October 1 without its permission.

# Congress-backed Nirmala Devi wins Sissu bypoll by 354 votes



Congress-supported Nirmala Devi secured victory as the result for the District Council member byelection in the Sissu ward of Lahaul-Spiti district was announced today.Nirmala Devi emerged winner getting 794 votes. She defeated her nearest competitor Sarita by a margin of 354 votes, who polled 440 votes.Returning Officer and SDM Kelong, Rajneesh Sharma, stated that the total valid votes were 1,234. Five votes were rejected and eight were NOTA (None of the Above) votes. There were no invalid votes.After the announcement of election result, Congress workers took out a procession at Keylong to celebrate Nirmala Devi's victory.Nirmala thanked the voters for the overwhelming support in the election. She assured the residents of Sissu that she will do her best to ensure development in this ward.Lahaul-Spiti MLA Anuradha Rana congratulated Nirmala Devi for scoring an impressive victory.The post Congress-backed Nirmala Devi wins Sissu bypoll by 354 votes appeared first on The Tribune.

# Massive Impact of Republic Expose, Siddaramaiah's Wife Writes To Return All 14 MUDA Lands

After the sensational expose by the Republic Media Network in the alleged MUDA scam prompting the Enforcement Directorate (ED) to book Karnataka Chief Minister Siddaramaiah, his wife on Monday offered to surrender all the 14 plots to the Mysuru Urban Development Authority (MUDA).Siddaramaiah's wife, Parvathi, in her letter to MUDA, expressed her wish to surrender all the compensatory land sites allotted to her by the authority. The Karnataka CM's wife's letter offering to return the land plots comes hours after the ED booked her husband Siddaramaiah in the money-laundering case.Notably, Parvathi is one of the accused in a money laundering case linked to the alleged MUDA scam. Her letter reads, "Further, I wish to surrender and return the compensation plots by cancelling the deeds of 14 plots executed in my favour by the Mysore Urban Development Authority. I am also handing over the possession of the plots back to the Mysore Urban Development Authority. Kindly take necessary steps in this regard as soon as possible.""Returning 14 sites and giving the possession to Authority, kindly do the needful at the earliest. I don't want any wealth, sites, or land for me. The dignity and honour of my husband, and family are far more important to me than any wealth. I have not discussed this with my husband, son or any family member," she wrote in a letter.

**ED Registers FIR Against Siddaramaiah**

Earlier in the day, the ED filed a case



naming Karnataka CM Siddaramaiah and others. The federal agency has pressed sections of the Prevention of Money Laundering Act (PMLA) to book Siddaramaiah in its ECIR, which is the equivalent of a police FIR.Last week, the Lokayukta police registered an FIR against Siddaramaiah, Parvathi, brother-in-law Mallikarjun Swamy, and one Devaraj, from whom Mallikarjuna Swamy purchased land and gifted it to Parvathi.The FIR was lodged after a special court in Bengaluru ordered the Lokayukta police to probe against Siddaramaiah on accusations of irregularities in allotment of 14 sites worth Rs 56 crore to the chief minister's wife by the Mysuru development authority.

**What Is MUDA Scam?**

The Mysuru Urban Development Authority (MUDA) is among Karnataka's first urban planning and development bodies. However, in the last few weeks, it has faced intense public scrutiny over allegations of irregularities in compensatory allotment of residential sites to land losers.The uproar gained political steam when it was alleged that Chief Minister Siddaramaiah's wife, Parvathi, was allotted 14 sites in an affluent residential layout in lieu of her land acquired by MUDA.In the MUDA site allotment case, it is alleged that compensatory sites were allotted to Siddaramaiah's wife in a prime area of Mysuru, which has a higher property value than the location of her land that was "acquired" by MUD A.The MUDA had allotted plots to Parvathi under a 50:50 scheme in exchange for 3.16 acres of her land, where it developed a residential layout.Under this controversial scheme, MUDA allocated 50 per cent of the developed land to landowners in lieu of undeveloped land acquired for residential layouts. It is alleged that Parvathi did not have legal title over the 3.16 acres of land located at survey number 464 in Kasare village, Kasaba hobli of Mysuru taluk.Siddaramaiah and Congress leaders claim the site allotment to Ms. Parvathi was legal. and within the framework of the 50:50 scheme introduced by the erstwhile BJP Government, but also released a list of other MUDA beneficiaries that name several JD(S) leaders, including Union Minister HD Kumaraswamy.A virulent, no-holds-barred attack by NDA allies BJP and JD(S) has taken the form of protests, night-long dharnas and, currently a 10-day long padayatra from Bengaluru to Mysuru.As things stand, the government has set-up a one-man judicial commission to probe into the scam. Amid all these developments, a show cause notice by Governor Thaawar

# Will Modi-Led NDA Government Complete Full Term? Prashant Kishor Says Longevity Depends On....

The Narendra Modi government at the Centre is dependent on Nitish Kumar's JDU and Chandrababu Naidu's TDP for its survival. The opposition is well aware of the poll arithmetic and even INDIA Bloc leaders have claimed that the Modi 3.0 won't complete its full term.Now, political analyst and Jan Suraaj Party founder Prashant Kishor says that the declining popularity of the BJP and the Modi government depends on several factors for survival."It is clear that the popularity and power of Modi ji and this (NDA) government has decreased. The longevity would depend on the elections in 9 states including Jammu and Kashmir, Delhi, Haryana, Maharashtra, Jharkhand and Bihar in the next 2-2.5 years. If results are against BJP then questions will definitely be raised about the stability of the government. If the BJP performs well in these states, then its power will remain," said Kishor.Talking about the BJP and JD(U) tie-up, Kishor said that even the BJP workers know that they cannot win the polls on the face of Nitish Kumar. "In Bihar, the BJP has lacklustre leadership, neither they have a face in the state nor they are putting any efforts. No one is talking about them. They have surrendered their leadership before Nitish Kumar. Every worker of the BJP is aware that they cannot win the polls in the name of Nitish Kumar," said Kishor.The Jan Suraaj founder further hinted that the BJP is locked in a tricky situation in Bihar. "BJP's compulsion is that they cannot remove Nitish Kumar from the post of Chief Minister as they have to run a government (with Nitish Kumar's support) in Delhi. They also know that they



cannot win elections in Bihar with Nitish as the Chief Minister. They are aware of the problems with the Bihar government but cannot do anything," said Kishor.Jan Suraaj has also announced to contest the Bihar polls, scheduled to be held in November 2025. The BJP will contest the poll in alliance with the LJP and JDU while the Congress will go into the polls with the RJD and the CPIM. There are 243 assembly seats in Bihar assembly and the majority mark is 122.

# Why is Sadhguru encouraging women to live like hermits when his daughter is well-settled?: Madras high court

Judges of the Madras high court wondered why does Sadhguru Jaggi Vasudev, founder of Isha Foundation, encourage women to tonsure their heads and live like hermits when he ensured that his daughter is married and well-settled in life, NDTV reported.The observation by a bench of SM Subramaniam and V Sivagnanam came while hearing a habeas corpus petition of a retired professor, who alleged that his well-educated daughters, aged 42 and 39, respectively, have been brainwashed by Jaggi Vasudev to live at Isha Yoga Centre in Tamil Nadu's Coimbatore permanently.

**Justices raise doubts**

The two daughters, however, appeared before the court and claimed to be residing at the centre out of their own choice.The foundation argued that the court could not expand the



scope of the case, but the court decided to probe the case as judges raised certain doubts regarding the case."We want to know why a person who had given his daughter in marriage and made her settle well in life is encouraging the daughters of others to tonsure their heads and live the life of a hermitess," wondered Justice Sivagnanam.The foundation argued that it could not understand the court's concern when two independent adults are 'free to choose' their own path in life. "You will not understand because you are appearing for a particular party. But this court is neither for nor against anybody. We only want to do justice to the litigants," replied Justice Subramaniam as per The Hindu report.In his petition, the professor alleged that some kind of food and medicine is being administered at the centre to his daughters, which made them lose their cognitive abilities.He also explained that his elder daughter is an M.Tech graduate from a university in the UK and was employed by the same institution for a salary of around ?1 lakh in 2004. She began attending yoga classes at the foundation after her divorce in 2008. Soon, the woman's younger sister also joined her to reside at the centre.

రాయల్ జర్నలిజం
ద్విభాషా దినపత్రిక ROYAL JOURNALISM

రాయల్ సినిమా







# అల్లు అర్జున్ - త్రివిక్రమ్... ఫ్యాన్స్‌కి పండగే



అల్లు అర్జున్, త్రివిక్రమ్ కాంబోలో ఇప్పటి వరకు జులాయి, సన్నాఫ్ సత్యమూర్తి, అల వైకుంఠపురం లో సినిమాలు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. మూడు సినిమాల్లో అల వైకుంఠపురంలో సినిమా రికార్డ్ బ్రేకింగ్ వసూళ్లు సొంతం చేసుకుంది. బన్నీ కెరీర్ లోనే బిగ్గెస్ట్ చిత్రాల జాబితాలో ముందు వరుసలో నిలుస్తుంది అనడంలో సందేహం లేదు. బన్నీ కెరీర్ లో మూడు కీలకమైన విజయాలను అందించిన త్రివిక్రమ్ ఇప్పుడు మరో బిగ్ ప్రాజెక్ట్ తో రెడీ అవుతున్నారు. ఇప్పటి వరకు పాన్ ఇండియా ను టచ్ చేయని త్రివిక్రమ్ మొదటి సారి పాన్ ఇండియా సినిమాకు రెడీ అవుతున్నాడు.ఈ ఏడాది ఆరంభంలో గుంటూరు కారం సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన త్రివిక్రమ్ ఆశించిన స్థాయిలో సక్సెస్ ను అందుకోలేక పోయాడు. అందుకే అల్లు అర్జున్ తో మరో భారీ విజయాన్ని సొంతం చేసుకోవాలని భావిస్తున్నారు. అందుకోసం త్రివిక్రమ్ ఈసారి సరికొత్త జోనర్ లో సినిమాను చేసేందుకు సిద్ధం అవుతున్నాడు. ఇప్పటి వరకు ఆయన టచ్ చేయని సోషియో ఫాంటసీ, మైథలాజికల్ సబ్జెక్ట్ తో త్రివిక్రమ్ సినిమా చేయబోతున్నాడు. భారీ అంచనాల నడుమ రూపొందబోతున్న ఈ సినిమాను వచ్చే ఏడాదిలో ప్రారంభించబోతున్న ట్లు సమాచారం అందుతోంది.ఇప్పటికే హ్యాట్రిక్ సొంతం చేసుకున్న అల్లు అర్జున్, త్రివిక్రమ్ లు మరో బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ తో ప్రేక్షకులను సర్‌ప్రైజ్ చేసే అవకాశాలు ఉన్నాయని తెలుస్తోంది. ఆకట్టుకునే కథ, మంచి స్క్రీన్ ప్లే తో త్రివిక్రమ్ సినిమాలు ఉంటాయనే టాక్ ఉంది. ఇప్పుడు అంతకు మించి భారీతనం ఉండే విధంగా ఆయన ప్లాన్ చేస్తున్నారు. అదే నిజమైతే అల్లు అర్జున్ తో ఆయన తీయబోతున్న సినిమా కచ్చితంగా ఇండియాస్ బిగ్గెస్ట్ చిత్రాల జాబితాలో నిలిచే అవకాశాలు ఉన్నాయని ఫ్యాన్స్ తో పాటు ప్రతి ఒక్కరు నమ్మకంగా ఉన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించే విధంగా వీరి సినిమా ఉండే అవకాశం ఉంది.పుష్ప 2 షూటింగ్ తో బిజీగా ఉన్న అల్లు అర్జున్ డిసెంబర్ 6న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. రికార్డ్ స్థాయి వసూళ్లతో ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద నిలుస్తుందని అంతా భావిస్తున్నారు. మరో వైపు ఈ సినిమా తో పాన్ ఇండియా రేంజ్ లో మరోసారి అల్లు అర్జున్ భారీ విజయాన్ని సొంతం చేసుకోబోతున్నాడు. పుష్ప 2 తో వచ్చే క్రేజ్ తో త్రివిక్రమ్ తో చేయబోతున్న సినిమా అంతకు మించి అన్నట్లుగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. త్రివిక్రమ్, అల్లు అర్జున్ కాంబోలో రాబోతున్న భారీ సోషియో ఫాంటసీ సినిమా ఖచ్చితంగా ఫ్యాన్స్ కి కన్నుల విందు గా ఉండటం ఖాయం, ఫ్యాన్స్ కి పండగ తీసుకు రావడం ఖాయం అంటున్నారు.

# అట్లీ మల్టీస్టారర్.. సెట్టయితే బీభత్సమే..



జవాన్ సినిమాతో తన క్రేజ్ ను మరో లెవెల్ కు తీసుకెళ్లిన అట్లీ, తన తదుపరి చిత్రంలో మరో పెద్ద ప్రయోగం చేయడానికి సిద్ధమవుతున్నాడు. అసలైతే అల్లు అర్జున్ తో ఒక సినిమా చేయనున్నట్లు ఆ మధ్య టాక్ వచ్చింది. నిజానికి అల్లు అరవింద్ ప్రొడక్షన్ లోనే ఈ కాంబినేషన్లో సినిమా రావాల్సింది. కానీ రెమ్యునరేషన్ బడ్జెట్ కారణాల వలన నిర్మాత గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదని మరొక టాక్ వచ్చింది.ఏదేమైనా అట్లీ టాలీవుడ్ హీరోతో సినిమా క్యాన్సిల్ చేసుకుని ఇప్పుడు బాలీవుడ్ సూపర్ స్టార్ తో సరికొత్త కాంబినేషన్ కు రెడీ అవుతున్నట్లు సమాచారం. బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్ ఇప్పటికే అట్లీ ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా లెవల్లో భారీ అంచనాలు ఉన్న ఈ సినిమాలో సల్మాన్ ప్రధాన పాత్రలో నటించనున్నారు.అయితే ఈ సినిమా గురించి మరో ఆసక్తికరమైన వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆ మేటర్ ఏంటంటే, అట్లీ తన డ్యూయల్ హీరో ప్రాజెక్ట్ కోసం యూనివర్సల్ హీరో కమల్ హాసన్‌ని సెకండ్ హీరోగా తీసుకోవడానికి ఫైనల్ టాక్స్ లో ఉన్నట్లు టాక్. రెండు ఇండస్ట్రీల లెజెండ్స్‌ని ఒకే స్క్రీన్ మీద చూడడం ప్రేక్షకులకు పెద్ద ట్రీట్‌గా నిలుస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.కమల్ హాసన్ ఈ ప్రాజెక్ట్‌కి గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఇది భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రభావవంతమైన పాన్-ఇండియా రీయూనియన్ కానుందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌కి సంగీతం అందించేది అనిరుద్ అని తెలుస్తోంది. తన ప్రత్యేకమైన మ్యూజిక్ స్టయిల్‌తో అనిరుద్ సంగీతం ఈ సినిమాకి మరింత బజ్ తీసుకురావడం ఖాయం.అట్లీ ఇప్పటికే పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న డైరెక్టర్. షారుక్ ఖాన్‌తో చేసిన 'జవాన్' మూవీ భారీ విజయం సాధించడం, అతని మార్క్‌కి మరింత బలాన్ని చేకూర్చింది. ఇక సల్మాన్ ఖాన్, కమల్ హాసన్ లాంటి పెద్ద స్టార్స్‌ను ఒకే సినిమాలో చూడటం ఎంతటి క్రేజీ కాంబినేషన్ అవుతుందో ఊహించుకోవచ్చు. ఈ ప్రాజెక్ట్ స్క్రిప్ట్ కోసం అట్లీ చాలా జాగ్రత్తగా పని చేస్తున్నాడు. ఇది కమర్షియల్ ఎలిమెంట్స్‌తో పాటు భావోద్వేగ భరితమైన కథతో రాబోతోందని చెబుతున్నారు. మరి, ఈ డ్యూయల్ హీరో ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుందో చూడాలి

# వితంతువు స్టోరీ.. ఆస్కార్స్ 2025 బరిలో?



ఇటీవల భారతదేశం నుంచి ఆస్కార్ బరిలో పోటీపడే చిత్రంగా కిరణ్ రావు 'లాపటా లేడీస్' చిత్రాన్ని ఎంపిక చేసిన సంగతి తెలిసిందే. ఉత్తమ విదేశీ చిత్రం కేటగిరీలో ఇది పోటీపడనుంది. ఇప్పుడు ఉత్తరప్రదేశ్‌కు చెందిన క్రైమ్ మూవీ సంతోష్ UK తరపున ఆస్కార్స్ లో పోటీపడనుందని తెలిసింది. ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిలిం కేటగిరీలో ఇది నామినేషన్ కోసం ప్రయత్నిస్తోంది.ది హాలీవుడ్ రిపోర్టర్ కథనం ప్రకారం.. యునైటెడ్ కింగ్‌డమ్ ఉత్తరప్రదేశ్ ఆధారిత క్రైమ్ డ్రామా సంతోష్ 2025 ఆస్కార్‌లకు ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిలిం విభాగంలో అధికారికంగా ప్రవేశించనుంది. సంధ్యా సూరి ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. ఇది భారతీయ పోలీసు కథ. క్రైమ్ డ్రామా నేపథ్యంలో తెరకెక్కింది. సంతోష్ ఈ సంవత్సరం ప్రారంభంలో అన్ సెర్టైన్ రిగార్డ్ విభాగంలో కేన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రదర్శితమైంది. ప్రతిష్ఠాత్మక అవార్డు వేడుకల్లో చాలామంది దృష్టిని ఆకర్షించింది. అనంతరం ఉత్తర అమెరికా పంపిణీ హక్కులను మెట్రోగ్రాఫ్ పిక్చర్స్ వెంటనే కైవసం చేసుకుంది. 2018లో టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ ఇంటర్నేషనల్ షార్ట్‌గా ఎంపికైంది. సంధ్యా సూరి పాపులర్ నేమ్. 2019లో బాఫ్టా నామినేషన్‌ను పొందిన ఆమె ప్రశంసలు పొందిన డాక్యుమెంటరీ ఐ ఫర్ ఇండియా (2005)ను రూపొందించారు. అవార్డు గెలుచుకున్న షార్ట్ ఫిల్మ్ ది ఫీల్డ్ తర్వాత సంధ్యా సూరి మొదటి ఫీచర్ ఫిలింగా సంతోష్ గుర్తింపు దక్కించుకుంది.

సంతోష్ సినిమా గురించి:ఈ చిత్రంలో షహానా గోస్వామి సంతోష్ అనే యువ హిందూ వితంతువుగా నటించారు. ఆమె తన దివంగత భర్త ప్రభుత్వ పథకం ద్వారా పోలీసు కానిస్టేబుల్‌గా వారసత్వ జాబ్ లో చేరుతుంది. పోలీస్ అవ్వగానే సంస్థాగత అవినీతిలో చిక్కుకుపోతుంది. నిమ్న-కుల దళిత సమాజానికి చెందిన యుక్తవయసులోని బాలిక హత్యను పరిశోధించడానికి ఆమె అనుభవజ్ఞుడైన డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ శర్మతో కలిసి పని చేస్తుంది. ఈ కథను ఎమోషనల్ గా తెరపై ఆవిష్కరించారు దర్శకురాలు.UK మూడుసార్లు అకాడమీ అవార్డ్స్‌లో ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ కేటగిరీకి నామినేట్ అయింది. 2024లో జోనాథన్ గ్లేజర్ మూవీ ది జోన్ ఆఫ్ ఇంట్రెస్ట్‌తో మొదటి ఆస్కార్‌ను గెలుచుకుంది. ఉత్తమ అంతర్జాతీయ ఫీచర్ ఫిలిం జాబితా ఏమిటన్నది 17డిసెంబర్ 2024న ప్రకటిస్తారు. అధికారిక నామినేషన్లు 17 జనవరి 2025న వెల్లడిస్తారు. 97వ అకాడమీ అవార్డుల వేడుకలు 2025 మార్చి 2న జరుగుతాయి.

# ఎన్టీఆర్‌తో కన్నడ బ్యూటీ జాక్ పాట్



కన్నడ భామలకి తెలుగులో ఎక్కువగా ఆఫర్స్ వస్తూ ఉంటాయి. అలాగే చాలా మంది టాలీవుడ్ స్టార్ హీరోయిన్స్ కూడా కర్ణాటక నుంచి వచ్చినవారే కావడం విశేషం. అనుష్క, పూజా హెగ్డే, రష్మిక లాంటి బ్యూటీస్ కన్నడ ప్రాంతం నుంచి టాలీవుడ్ లోకి అడుగుపెట్టి ఇక్కడ స్టార్ హీరోయిన్స్ గా గుర్తింపు తెచ్చుకున్నారు. 'కాంతారా' ఫేమ్ సప్తమి గౌడ, 'కేజీఎఫ్' సిరీస్ తో సక్సెస్ అందుకున్న శ్రీనిధి శెట్టి ఇప్పటికే టాలీవుడ్ లోకి తెరంగేట్రం చేశారు.ఇప్పుడు వీరి దారిలో మరో కన్నడ అందం రుక్మిణీ వసంత్ తెలుగులోకి అడుగుపెడుతోందనే టాక్ వినిపిస్తోంది. ఈ బ్యూటీ తెలుగులో మొదటి చిత్రంతోనే ఏకంగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ లాంటి పాన్ ఇండియా స్టార్ తో జతకట్టబోతోందనే ప్రచారం నడుస్తోంది. ఎన్టీఆర్ నెక్స్ట్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో 'డ్రాగన్' మూవీని సెట్స్ పైకి తీసుకొని వెళ్లబోతున్నాడు. భారీ బడ్జెట్ తో మాఫియా బ్యాక్ డ్రాప్ కథతో ఈ సినిమా తెరకెక్కనుంది.ప్రస్తుతం ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందని తెలుస్తోంది. అలాగే క్యాస్టింగ్ ని ఫైనల్ చేసే పనిలో ప్రశాంత్ నీల్ ఉన్నాడంట. 'డ్రాగన్' మూవీలో హీరోయిన్ క్యారెక్టర్ కోసం ప్రశాంత్ నీల్ రుక్మిణీ వసంత్ ని ఫైనల్ చేసినట్లు ప్రచారం నడుస్తోంది. కన్నడంలో రక్షిత్ శెట్టికి జోడీగా 'సప్తసాగరాలు ధాటి' అనే సినిమాతో రుక్మిణీ అందరికి చేరువ అయ్యింది. ప్రస్తుతం ఈ బ్యూటీ చేతిలో నాలుగు సినిమాలు ఉన్నాయి.వాటిలో కన్నడ మూవీస్ రెండు కాగా తమిళంలో విజయ్ సేతుపతి, శివకార్తికేయన్ సినిమాలలో రుక్మిణీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇవన్నీ కూడా భారీ బడ్జెట్ తో తెరకెక్కుతోన్న సినిమాలే కావడం విశేషం. ఈ సినిమాలు లైన్ అప్ లో ఉండగానే ఏకంగా ఎన్టీఆర్ తో జోడీగా కన్ఫర్మ్ అయ్యిందనే వార్త తెరపైకి వచ్చింది. త్వరలో ఈ బ్యూటీ హీరోయిన్ గా ఫిక్స్ అయినట్లు మేకర్స్ అఫీషియల్ గా ప్రకటించే అవకాశం ఉందంట.ఒకవేళ రుక్మిణీ 'డ్రాగన్' మూవీలో నటించడం ఖాయం అయితే మాత్రం ఆమెకిది టాలీవుడ్ గ్రాండ్ ఎంట్రీ అవుతుంది. అలాగే పాన్ ఇండియా హీరోయిన్ గా కూడా మరిన్ని అవకాశాలు అందుకోవచ్చు. ఇక 'డ్రాగన్' మూవీ 2026 సంక్రాంతికి రిలీజ్ కన్ఫర్మ్ చేశారు. ఈ ఏడాదిలోనే మూవీ రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది.

# వర్మ సినిమాలు చూసి నేర్చుకున్నా..!



టాలీవుడ్ లో అర్జున్ రెడ్డి సినిమాను తీసి దర్శకుడిగా కెరీర్ ను మొదలు పెట్టిన సందీప్ వంగ ప్రస్తుతం బాలీవుడ్ లో మోస్ట్ క్రేజీ దర్శకుడిగా పేరు దక్కించుకున్నాడు. ఈయన రణబీర్ కపూర్ తో చేసిన యానిమల్ సినిమా దాదాపుగా రూ.వెయ్యి కోట్ల వసూళ్లు నమోదు చేసింది. దాంతో ఆయన దర్శకత్వంలో సినిమాలను చేసేందుకు దాదాపు అందరు బాలీవుడ్ హీరోలు ఆసక్తి చూపిస్తున్నారు. ప్రస్తుతం మాత్రం ఆయన ప్రభాస్ తో స్పిరిట్ సినిమాను చేసేందుకు సిద్ధం అవుతున్నాడు. గత కొన్ని రోజులుగా స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. ఈ ఏడాది చివరి వరకు స్క్రిప్ట్ వర్క్ ను ముగించే అవకాశాలు ఉన్నాయి.సందీప్ వంగ తాజాగా జరిగిన ప్రతిష్టాత్మక ఐఫా అవార్డు వేడుకల్లో పాల్గొన్నారు. అక్కడ ఉత్తమ ఎడిటర్ అవార్డును సొంతం చేసుకున్నారు. దర్శకుడిగానే కాకుండా ఉత్తమ ఎడిటర్ అవార్డును సొంతం చేసుకోవడం చాలా ప్రత్యేకమైన విషయం. అవార్డు తీసుకున్న సందర్భంగా సందీప్ వంగ మాట్లాడుతూ.. తాను రామ్ గోపాల్ వర్మ గారికి పెద్ద అభిమానిని. ఆయన సినిమాలు చూస్తూ నేను ఎడిటింగ్ ఎలా చేయాలి అనే విషయాలను నేర్చుకున్నాను. ఆయన సినిమాలు చూస్తూ ఇండస్ట్రీలో ఎంట్రీ ఇవ్వాలని అనుకున్నాను అన్నట్లుగా సందీప్ వంగ చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి.ప్రతిష్టాత్మక ఐఫా అవార్డు వేడుకలో వర్మ పేరు ఎత్తి సందీప్ వంగ చేసిన వ్యాఖ్యలను ప్రతి ఒక్కరు అభినందిస్తున్నారు. నిజంగా ఇది గొప్ప విషయం అన్నట్లుగా కామెంట్స్ చేస్తున్నారు. ఇక సందీప్ వంగ మాట్లాడిన వీడియోను షేర్ చేసిన రామ్ గోపాల్ వర్మ మాట్లాడుతూ.. ఇకపై నీ వద్ద నేను ఫిల్మ్ మేకింగ్ నేర్చుకోవాలి అనుకుంటున్నాను అంటూ కామెంట్ పెట్టాడు. వర్మ వంటి సీనియర్ గొప్ప దర్శకుడి నుంచి అలాంటి కామెంట్ రావడం గొప్ప విషయం అనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. సోషల్ మీడియాలో ప్రస్తుతం వీరిద్దరికి సంబంధించిన ఈ విషయం తెగ వైరల్ అవుతోంది.సందీప్ వంగ అర్జున్ రెడ్డిని హిందీలో కబీర్ సింగ్ అంటూ రీమేక్ చేసి సూపర్ హిట్ ను దక్కించుకున్నాడు. ఆ సినిమా సాధించిన వసూళ్లు, పొందిన గుర్తింపు కారణంగా అంచనాలు భారీగా నమోదు అయ్యాయి. అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా యానిమల్ సినిమాను రూపొందించారు. యానిమల్ సినిమా సాధించిన విజయం తో స్పిరిట్ సినిమా పై అంచనాలు ఆకాశాన్ని తాకేలా ఉన్నాయి. మరి ప్రభాస్ తో దర్శకుడు సందీప్ వంగ స్పిరిట్ ను ఎలా రూపొందిస్తాడు అని అంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. భారీ అంచనాల నడుమ రూపొందబోతున్న స్పిరిట్ ను 2026 లో ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# బ్యాటింగ్ చేసేటప్పుడు.. తేనెటీగ కుట్టింది: బంగ్లా బ్యాటర్ మెహిదీ

భారత్ - బంగ్లాదేశ్ జట్ల మధ్య రెండో టెస్టు ఉత్కంఠభరితంగా మారి ంది. విజయమే లక్ష్యంగా టీమ్ ఇండియా దూకుడుగా ఆడుతోంది. తొలిరోజు 35 ఓవర్ల ఆట జరిగిన సంగతి తెలిసిందే. రెండు, మూడు రోజుల గేమ్ ఒక్క బంతీ పడకుండానే తుడిచిపెట్టుకుపోయింది. నాలుగోరోజు పూర్తిగా ఆట జరిగింది. భారత్ తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం సాధిం చింది. తొలి ఇన్నింగ్స్‌లో 285/9 స్కోరు వద్ద ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. అంతకుముందు బంగ్లాను 233 పరుగులకు ఆలౌట్ చేసిన సంగతి తెలిసిందే. అయితే, తాను బ్యాటింగ్ చేస్తున్న సమయంలో తేనెటీగ కుట్టిన ట్లు బంగ్లా ఆటగాడు మెహిదీ హసన్ మిరాజ్ వెల్లడించాడు. “నాకు దగ్గర గా ఓ తేనెటీగ వచ్చింది. నేను ఓ షాట్ కొట్టిన తర్వాత అది నన్ను కుట్టింది. ఏం జరిగిందనుకొనేలోపు నొప్పిగా అనిపించింది” అని మిరాజ్ తెలిపాడు.

**షకిబ్ గురించి ముందే తెలుసు..**

టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికిన బంగ్లాదేశ్ సీనియర్ క్రికెటర్ షకిబ్ అల్హసన్ టెస్టులకూ రిటైర్‌మెంట్‌పై ఆసక్తికర వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అయితే, వీడ్కోలు గురించి షకిబ్ ముందే తమకు చెప్పాడని మిరాజ్ వ్యాఖ్యానించాడు. “షకిబ్ భాయ్ మాకు ముందే తన నిర్ణయం గురించి తెలియజేశాడు. టెస్టు క్రికెట్ నుంచి వీడ్కోలుకు సంబంధించి పక్కా ప్లానింగ్‌తో ఉన్నాడు.

# వారు ఆడినంత మాత్రాన... కేఎల్ ప్లేస్ డేంజర్‌లో ఉందని కాదు: పార్థివ్ పటేల్

బంగ్లాదేశ్‌తో రెండో టెస్టులో కేఎల్ రాహుల్ హాఫ్ సెంచరీ సాధించాడు. కేవలం 43 బంతుల్లోనే 68 పరుగులు సాధించాడు. గాయం కారణంగా టెస్టు క్రికెట్‌కు దూరంగా ఉన్న కేఎల్ ఇప్పుడు బంగ్లాతో సిరీస్‌లో చోటు దక్కించుకున్నాడు.గత సిరీసుల్లో అతడు లేకపోవడంతో శ్రేయస్ అయ్యర్, సర్ఫరాజ్ ఖాన్ వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకున్నారు. మరీ ముఖ్యంగా సర్ఫరాజ్ వరుసగా హాఫ్ సెంచరీలు సాధించాడు. ఇప్పుడు బంగ్లాతో రెండు టెస్టుల సిరీస్‌కూ సర్ఫరాజ్ ఎంపికైనప్పటికీ.. తుది జట్టులో మాత్రం కేఎల్‌కే మేనేజ్‌మెంట్ అవకాశం ఇచ్చింది. మంచి ప్రదర్శనే చేశాడు. ఈ క్రమంలో కేఎల్‌పై భారత మాజీ క్రికెటర్, వ్యాఖ్యాత పార్థివ్ పటేల్ ప్రశంసలు కురిపించాడు.“కేఎల్ రాహుల్ సామర్థ్యంపై సందేహాలు అవసరం లేదు. అతడి బ్యాటింగ్ నైపుణ్యం అద్భుతం. కేఎల్ గైర్హాజరీలో జట్టులోకి వచ్చిన క్రికెటర్ మంచిగా ఆడినంత మాత్రాన.. సీనియర్ బ్యాటర్ ప్లేస్‌మెంట్‌కు వచ్చిన ప్రమాదమేమీ లేదు. జట్టులో అతడి స్థానానికి ఎలాంటి ఢోకా లేదని భావిస్తున్నా. కేఎల్ రాహుల్ ఒత్తిడిలో ఉన్నారని ఎవరైనా చెబితే.. నాకు ఆశ్చర్యమేస్తుంటుంది. అతడు గాయానికి గురికాకముందు దక్షిణాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో మంచి ప్రదర్శన చేశాడు. ఇంగ్లండ్‌పైనా అద్భుతంగా ఆడాడు. ఇప్పుడు బంగ్లాదేశ్‌పై దూకుడు ప్రదర్శించాడు. ఆ షాట్లు కొట్టడం కూడా అంత తేలికైన విషయం కాదు. పిచ్‌పై నిలకడ లేని బౌన్స్ ఉన్నప్పుడు బంతి ఎలా వస్తుందో అంచనా వేయలేం. కానీ, కేఎల్ మాత్రం సూపర్ షాట్లతో ఆడాడు. స్వేచ్ఛగా ఆడితే రాహుల్ నుంచి వచ్చే ఇలాంటి అద్భుతమైన షాట్లను ఎన్నో చూడొచ్చు” అని పార్థివ్ వ్యాఖ్యానించాడు.

ప్రతీ జట్టులోనూ ఇంతే..: తమీమ్

“ప్రతీ జట్టులోనూ ఇలాంటి పరిస్థితి ఉంది. ఎవరైనా ఆటగాడు ఒకటి, లేదా రెండు మ్యాచుల్లో కాస్త విఫలమైతే చాలు బయటి నుంచి విమర్శలు మొదలవుతాయి. అంతకుముందు వారి గణాంకాలను చూడకుండా తప్పుబట్టడం ప్రారంభిస్తారు. కేఎల్ రాహుల్‌కూ ఇలాంటి అనుభవమే ఎదురైంది. వరుసగా అన్ని మ్యాచుల్లోనూ రాణించి.. కేవలం ఓ రెండు మ్యాచుల్లో పెద్దగా పరుగులు చేయలేదంటే అతడిని పక్కన పెట్టేయాలనే వితండవాదం చేసేందుకు కొందరు సిద్ధంగా ఉంటారు” అని బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ తెలిపాడు.

# డగౌట్ నుంచి రోహిత్ శర్మ సందేశమిదే: కేఎల్ రాహుల్



కాన్పూర్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో బంగ్లాదేశ్‌పై భారత్ ఆధిపత్యం కొనసాగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో 52 పరుగులు ఆధిక్యం సాధించడంలో కేఎల్ రాహుల్ హాఫ్ సెంచరీ కూడా కీలకపాత్ర పోషించింది.దూకుడుగా ఆడాలని రోహిత్ నుంచి స్పష్టమైన సందేశం వచ్చిందని.. అందుకు తగ్గట్టుగానే ఆడినట్లు కేఎల్ రాహుల్ వెల్లడించాడు. అయిదో రోజు ప్రారంభానికి ముందు కేఎల్ మాట్లాడాడు.“తొలి నుంచి మా లక్ష్యంపై స్పష్టమైన అవగాహన ఉంది. రెండు రోజులపాటు వర్షం వల్ల ఆట రద్దైంది. వాతావరణం కారణంగా జరిగినప్పుడు మనం ఏం చేయలేం. మన చేతుల్లో లేని వాటి గురించి ఆలోచించకూడదు. మిగిలిన సమయంలో ఏం చేయగలమనే దానిపై దృష్టిపెట్టాం. విజయం సాధించడమే లక్ష్యంగా బరిలోకి దిగాం. డగౌట్‌లోని కెప్టెన్ రోహిత్ నుంచి మాకు స్పష్టమైన సందేశం వచ్చింది. ఔటైనా ఫర్వాలేదు వేగంగా ఆడి ఎక్కువ పరుగులు చేయాలని సూచించాడు. ఆ తర్వాత మా బౌలర్లు నాణ్యమైన బౌలింగ్‌తో ఆకట్టుకున్నారు” అని కేఎల్ వెల్లడించాడు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY CHALLA SRIKANTH, PRINTED AT SRINIVASA PRINTERS D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA WEST,(U) VILLAGE, BAPATLA - 522101, GUNTUR DISTRICT, ANDHRA PRADESH, PUBLISHED AT D.NO 7-4-5, NEAR RAMALAYAM TEMPLE, BAPATLA -522101 GUNTUR DISTRICT, ANDHRA PRADESH, EDITOR : CHALLA SRIKANTH, RNI : APBIL / 2023 / 86665, CELL: 6281086394 , emil srikanth9550389070@gmail.com